**టాప్ న్యూస్**

### తెలుగునాడుగా ఆంధ్రప్రదేశ్
- రాష్ట్రం పేరు మార్చాలని గరికిపాటి డిమాండ్




02

### ఇరాన్ వార్ ఎఫెక్ట్..
- బంగారం 2 లక్షలు
- వెండి రూ.4లక్షలు?



02

### భూభారతి.. భారీ స్కామ్
- ఈ స్కామ్ పై సిట్, సీఐడీ వేయండి
- బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్ రావు డిమాండ్



02


ANN తెలుగు

Follow: @ANNTELUGU

01-03-2026

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 63 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM







# 23 మంది సజీవదహనం

## కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణాసంచా కేంద్రంలో పేలుళ్ళు

- పేలుళ్ళ తీవ్రతకు ఎగిరిపడ్డ మృతదేహాలు.. పెనువిషాదంతో.. ఉలిక్కిపడ్డ కోనసీమ
- ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- ఘటనాస్థలికి చంద్రబాబు.. పరిస్థితిపై సమీక్ష
- విషమంగా మరికొందరి పరిస్థితి.. పొలాల మధ్యన తయారీకేంద్రం
- సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం.. కన్నీరుమున్నీరైన బాధిత కుటుంబాలు

**కాకినాడ, మహా :** కాకినాడ జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. శనివారం సామర్లకోట మండలం వేట్లపాలెంలో భారీ పేలుడు సంభవించింది. ఓ బాణాసంచా తయారీ కేంద్రంలో టపాసులు తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో భారీగా ఎగిసి పడుతున్న మంటల్లో చిక్కుని 23 మంది కార్మికులు సజీవ దహనమయ్యారు. పలువురు గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పేలుడుధాటికి మృత దేహాలు స్థానిక పంట పొలాల్లోకి ఎగిరిపడ్డాయని స్థానికులు చెబుతున్నారు. ఈ విషాదకర ఘటన సమయంలో బాణసంచా కేంద్రంలో 30 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు.

మిగతా 2లో

### ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి..

ఈ ఘటనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు తగిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అలాగే, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా బాణసంచా తయారీ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. క్షతగాత్రులను కూడా పరామర్శించారు.



# భీకర యుద్ధం

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

- ఇరాన్ పై ఇజ్రాయిల్, అమెరికా మిస్సైళ్ల దాడి
- సుప్రీంలీడర్ ఖమేనీ లక్ష్యంగా దాడి.. ఇరాన్ రక్షణమంత్రి మృతి
- మా మాట వినకుంటే ఇరాన్‌ను నాశనం చేస్తాం: ట్రంప్ హెచ్చరిక
- ప్రతిగా 8 దేశాలపై ఇరాన్ కౌంటర్ ఎటాక్
- బహ్రెయిన్, దుబాయ్, అబుదాబి సహా అనేక ప్రాంతాల్లో దాడులు
- దుబాయ్ లో బాంబుల మోత.. బూర్జు ఖలీఫా ఖాళీ
- విమాన సర్వీసులన్నీ బంద్.. ఎయిర్ పోర్టులన్నీ ప్రయాణికులతో కిటకిట
- అప్రమత్తమైన యూరప్ దేశాలు.. అత్యవసర భేటీలు నిర్వహించిన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, నార్వే
- దాడుల గురించి మిత్రదేశాలకు సైతం సమాచారం ఇవ్వని అమెరికా
- ట్రంప్ ఏకపక్ష వైఖరిపై ఆగ్రహం.. పశ్చిమాసియాలో ఉన్న భారతీయులు అప్రమత్తంగా ఉండాలి: భారత్

**(మహా నెట్ వర్క్ )**

పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్ అణు స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ , అమెరికా దళాలు సైనిక చర్యలు ప్రారంభించాయి. ఇరాన్‌పై పట్టపగలే అమెరికా, ఇజ్రాయెల్ బాంబులతో పెద్దఎత్తున విరుచుకుపడ్డాయి. టెహ్రాన్‌లోని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ కార్యాలయం సమీపంలో తొలి దాడి జరిపాయి. అనంతరం వేర్వేరు ప్రాంతాల్లో బాంబుల వర్షం కురిపించాయి. ఇరాన్ మిలిటరీ, ప్రభుత్వ, ఇంటెలిజెన్స్ కార్యాలయాలే టార్గెట్‌గా దాడులు చేశాయి. బాంబు దాడులతో ఆయాప్రాంతాల్లో పెద్దఎత్తున పొగలు అలుముకున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా సైనిక దళాలు ఇరాన్‌పై మిస్సైళ్లతో విరుచుకుపడ్డాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని సుప్రీం లీడర్ 86 ఏళ్ల ఆయతుల్లా అలీ ఖమేనీ కార్యాలయాలు లక్ష్యంగా ఇజ్రాయెల్, అమెరికా సైన్యాలు కలిసి ఈ దాడులు చేశాయి. ఆయా కార్యాలయాల సమీపంలోనే పేలుళ్లు జరిగాయి. అయితే ఖమేనీతో పాటు తమ అధ్యక్షుడు సురక్షితంగా ఉన్నారని ఇరాన్ ప్రభుత్వవర్గాలు ప్రకటించాయి. ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఇరాన్ వెంటనే గగనతలాన్ని మూసివేసింది. దీంతోపాటు తమ దేశంలో మొబైల్ ఫోన్ సేవలను నిలిపివేసింది.

మిగతా 2లో

## విద్యాకమిషన్ సిఫార్సులు చెత్తబుట్టలో వేయండి

### ఉత్తీర్ణత మార్కులు 35 నుండి 45కు పెంచడం దుర్మార్గం

### కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం




**హైదరాబాద్, మహా :** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా కమిషన్ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలని ఎద్దేవా చేశారు. విద్యారంగ అభ్యున్నతి కోసం సిఫారసులేవి? అని ప్రశ్నించారు. టీచర్ల జీతాలను తగ్గించాలని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. విద్యావేత్తలు లేని విద్యా కమిషన్ ఇదని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. అర్బన్ నక్సలైట్ ఆధ్వర్యంలో వేసిన కమిషన్‌కు విలువేముంది..? అని నిలదీశారు. విద్యాశాఖకు మంత్రి లేరనే విషయాన్ని కూడా గుర్తించని కమిషన్ ఎందుకు? అని బండి సంజయ్ ప్రశ్నల వర్షం కురిపించారు. చాక్ పీసులకు పైసల్లేక, స్కావెంజర్లు లేక స్కూళ్లు అల్లాడుతుంటే పరిష్కార మార్గాలు చూపరా..? అని ఫైర్ అయ్యారు. కనీస ఉత్తీర్ణత మార్కులను 35 నుంచి 45కు పెంచడం దుర్మార్గమని అన్నారు. పేద విద్యార్థులు స్కూల్ స్థాయిలోనే ఫెయిలై ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలతో, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకోకుండా రూపొందించిన ఏకపక్ష నివేదిక ఇదని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయులను విద్యా కమిషన్ అవమానించిందని బండి సంజయ్ మండిపడ్డారు. స్థానిక పరిస్థితులను పట్టించుకోకుండా విదేశాల్లో తిరిగి నివేదిక ఇస్తే ఒరిగేదేముంది..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఉపాధ్యాయులారా...మీకు అండగా బీజేపీ ఉంటుందని భరోసా కల్పించారు.

### మదీనా ప్రమాద మృతుల కుటుంబాలకు

## సీఎం రేవంత్ అండ

### 44 కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం



**హైదరాబాద్, మహా :** గతేడాది నవంబర్ 17న సౌదీ అరేబియా మదీనా సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో 44 మంది హైదరాబాదీయులు సజీవ దహనం కాగా, మదీనా ప్రమాద మృతుల కుటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి శనివారం పరిహారం చెక్‌లను అందించారు. మృతుల కుటుంబసభ్యులకు 5 లక్షల చొప్పున పరిహారం అందించారు. అలాగే గాయపడినవారికి 3 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ''ప్రమాదం గురించి తెలియగానే సహాయ చర్యలపైన కేంద్రంతో మాట్లాడా. మంత్రి అజారుద్దీన్‌ను మదీనా పంపించా. బాధిత కుటుంబాలకు 5 లక్షల పరిహారం ఇవ్వాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం. దేశం బయట జరిగే ప్రమాదాలకు ప్రభుత్వాలు పరిహారం చెల్లించదు. కానీ భాదితుల కుటుంబాల పరిస్థితి చూసి సహాయం ప్రకటించాం. నాంపల్లి అగ్ని ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలను కూడా ఆదుకున్నాం. ప్రభుత్వం అండగా ఉంటుందనే నమ్మకం కల్గించడం ముఖ్యం. అందుకే కుటుంబాలను సెక్రటేరియట్‌కు పిలిచి పరిహారం అందించాం'' అని సీఎం రేవంత్ తెలిపారు. కార్యక్రమంలో మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఫహీంఖురేషీ పాల్గొన్నారు.

## విమాన సర్వీసులు బంద్

### ఆపరేషనల్ అలర్ట్‌లో విమానాశ్రయాలు

వివరాలు 2లో




Scan here.
Step Forward. Get Recognized. Be Celebrated.

# భీకర యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)



అలాగే ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ సురక్షిత ప్రాంతానికి తరలించింది. తమ దేశంపై దాడి జరిగితే, ఊరుకునేది లేదని బలంగా ప్రతిఘటిస్తామని గతంలో హెచ్చరించిన ఇరాన్ 8 దేశాలపై ఎటాక్ చేసింది. ఇరాన్ ప్రతిదాడి చేయడంతో మొత్తం ప్రపంచమతా ఉలిక్కిపడింది. టూరిజం అడ్డా దుబాయ్ ఇరాన్ బాంబులతో దద్దరిల్లింది. బూర్జుఖలీఫా ఖాళీ అయింది. అమెరికా సైనికస్థావరాలున్న అన్నిదేశాల్లోనూ ఇరాన్ మిస్సైళ్ళతో గడగడలాడించింది. ఈ దాడులను ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ"గా పేర్కొంది పెంటగాన్.

**ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌కు చెందిన ఇద్దరు ప్రముఖులు మృతి**

ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌కు చెందిన ఇద్దరు ప్రముఖులు మృతి చెందారు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ రక్షణమంత్రి అమీర్ నాసిర్జాదే , రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ పక్పూర్ మృతి చెందినట్లు రాయిటర్స్ కథనం పేర్కొంది. మరోవైపు యావత్ ఇజ్రాయెల్‌లో ఆయన అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఇజ్రాయెల్ దాడికి ప్రతిగా ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులు చేస్తుందనే ఆందోళనలతో ఇజ్రాయెల్‌లో అత్యవసర పరిస్థితిని అమలు చేస్తున్నారు. అంతటా ఎయిర్ రైడ్ సైరన్లు మోగుతున్నాయి. బంకర్లలో దాక్కోవాలి అంటూ ప్రజలకు ఇజ్రాయెల్ ప్రభుత్వం ఎమర్జెన్సీ మెసేజ్‌లను పంపుతోంది. వెంటనే ఇజ్రాయెల్, పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తుందా ? చేయదా ? అనే ఉత్కంఠ నెలకొనగా, ఇరాన్ చేసి చూపించింది. తమ దేశంపై దాడి జరిగితే, ఊరుకునేది లేదని బలంగా ప్రతిఘటిస్తామని గతంలో ఇరాన్ హెచ్చరించింది. ఈనేపథ్యంలో ఇరాన్ ప్రతిదాడి చేయడంతో మొత్తం ప్రపంచమతా ఉలిక్కిపడింది.

**ఇజ్రాయెల్‌లోని భారతీయులకు అడ్వైజరీ**

ఇరాన్ ఇజ్రాయెల్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇజ్రాయెల్‌లోని భారత ఎంబసీ కీలక ప్రకటన విడుదల చేసింది. ఇజ్రాయెల్‌లోని భారతీయులంతా సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని పిలుపునిచ్చింది. అత్యంత అప్రమత్తంగా, ముందుజాగ్రత్త చర్యలతో వ్యవహరించాలని వారికి సూచించింది. ఇజ్రాయెల్ అధికార వర్గాలు, హోం ఫ్రంట్ కమాండ్ ఎప్పటికప్పుడు జారీచేసే భద్రతా మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని కోరింది. పశ్చిమాసియాలో ఉన్న భారతీయులతో సంప్రదింపులు జరుపుతున్నామని, అప్రమత్తంగా ఉండాలని భారత్ కోరింది.

**ప్రతీకార దాడులు**

మరోవైపు, తమపై దాడులకు దిగిన ఇజ్రాయెల్‌పై, గల్ఫ్ దేశాల్లోని అమెరికా మిలిటరీ క్యాంప్‌లపై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టింది. ఇరాన్ వైపు నుంచి క్షిపణులు దూసుకు రావడంతో ఇజ్రాయెల్ వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో సైరన్లను మోగించారు. క్షిపణులను అడ్డుకుని, తిరిగి దాడి చేయడానికి ఇజ్రాయెల్ దళాలు ప్రయత్నిస్తున్నాయి. ఇజ్రాయెల్‌తో పాటు, పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులు చేసింది.

తమ దేశంలోని అమెరికా నేవీ ఐదో ఫ్లీట్‌పై దాడి జరిగినట్టు బహ్రెయిన్ తెలిపింది. అలాగే కువైట్, యూఏఈ, ఖతర్‌లలో కూడా పేలుళ్లు వినిపించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. యూఏఈ, ఖతార్ తదితర దేశాలు గగనతలాన్ని మూసివేశాయి. దుబాయ్ లో బాంబులమోత మోగగా, ఓ హోటల్ దగ్ధమైంది, అబుదాబిలోనూ దాడులు జరిగాయి.

**ట్రంప్ ఒత్తిడి వ్యూహంతో దాడి**

ఇరాన్ అణ్వస్త్ర కార్యక్రమాన్ని ఎలాగైనా ఆపాలనే పట్టుదలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ దాడికి తెగబడ్డట్లు తెలుస్తోంది. ఈ అంశంపై స్విట్జర్లాండ్‌లోని జెనీవా వేదికగా ఫిబ్రవరి 26 వరకు ఇరాన్, అమెరికా పరోక్ష చర్చలు జరిపాయి. ఈ చర్చలకు ఒమన్ దేశం మధ్యవర్తిత్వం వహించింది. ఇందులో ట్రంప్ ఆశించిన ఫలితమేదీ రాలేదు. ట్రంప్ సర్కారు పెట్టిన చాలా షరతులకు ఒప్పుకోవడానికి ఇరాన్ ససేమిరా చెప్పింది. దీంతో తదుపరి దశ చర్చలను మార్చి 2న ఆస్ట్రియా రాజధాని వియన్నాలో నిర్వహించాలని ఇరాన్, అమెరికా నిర్ణయించాయి. ఈనేపథ్యంలో ఇరాన్‌పై ఒత్తిడిని పెంచి, తన షరతులను అమల్లోకి తేవాలనే సంకల్పంతో అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ ఉన్నారు. ఈక్రమంలో పశ్చిమాసియా ప్రాంతంలోని 19 సైనిక స్థావరాల్లో పెద్ద సంఖ్యలో అమెరికా సైనికులు, యుద్ధ విమానాలను మోహరించారు. ఇరాన్ చుట్టూ ఉన్న సముద్ర జలాల్లోనూ భారీ యుద్ధ నౌకల మోహరింపును ట్రంప్ పూర్తి చేశారు. మార్చి 2వ తేదీకి మరో రెండు రోజులే మిగిలి ఉన్నాయి. వియన్నాలో రెండోదశ చర్చలు మొదలయ్యేలోగా, దాడుల ద్వారా ఇరాన్‌పై ఒత్తిడిని పెంచాలనే వ్యూహంతో ట్రంప్ ఉన్నారు.

**మిత్రదేశాలకు సమాచారం ఇవ్వని అమెరికా**

దాడుల గురించి మిత్రదేశాలకు సైతం స అమెరికా సమాచారం ఇవ్వలేదు. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడులపై ప్రపంచ దేశాల భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. ఇది ప్రాంతీయ ఘర్షణగా మారే అవకాశం ఉండటంతో యూరప్ దేశాలు అప్రమత్తమయ్యాయి. విచక్షణారహితంగా దాడులు చేయవద్దని ఇరాన్‌ను న యూరప్ నేతలు హెచ్చరించారు. చర్చలు ప్రారంభించాలని అమెరికాఇరాన్‌ను యూరప్ నేతలు కోరారు. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, నార్వే అత్యవసర భేటీలు నిర్వహించారు. దాడుల గురించి మిత్రదేశాలకు సైతం సమాచారం ఇవ్వకపోవడం, ట్రంప్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని యూరప్ దేశాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఐరాస భద్రతా మండలి అత్యవసర సమావేశానికి ఫ్రాన్స్ అధ్యక్షుడి పిలుపునిచ్చారు. యూఏఈ, ఖతార్, జోర్డాన్‌కు సైనిక సాయం అందిస్తామని మెక్రాన్ తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్ ఏకపక్ష చర్యను తిరస్కరిస్తున్నామని ఫ్రాన్స్ మండిపడింది. అన్ని పక్షాలు సంయమనం పాటించాలని యూరప్ కమిషన్ అధినేత ఉర్సులా వాన్ కోరారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులను మలేషియా, పాకిస్థాన్ తీవ్రంగా ఖండించారు. ఎలాంటి కవ్వింపులు లేకుండానే చేసిన దురాక్రమణ చర్యగా రష్యా పేర్కొంది. ఇరాన్‌పై దాడులు ఆపేసి చర్చలు జరపాలని రష్యా డిమాండ్ చేసింది. ఇరాన్‌లోని పాలకులను చంపేందుకు అణు బూచిని చూపిస్తున్నారని రష్యా ఆగ్రహం వ్యక్తం చేసింది.

**ట్రంప్‌తో హాట్‌లైన్‌లో మాట్లాడిన నెతన్యాహు**

టెహ్రాన్: అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై భీకరదాడులకు దిగడంతో పశ్చిమాసియాలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరాన్ పాలకులకు చరమగీతం పాడటమే లక్ష్యంగా జరుపుతున్న ఈ దాడుల్లో ఇరాన్ వైపు భారీ నష్టం జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఇరాన్ సైతం ప్రతిదాడులకు దిగుతోంది. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితిపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శనివారం రాత్రి ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి కార్యాలయం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపింది.

**దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్న ఖమేనీ..**

ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేని మృతిచెందినట్టు కూడా వార్తలు వెలువడుతున్నాయి. అయితే ఈ వార్తలను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఖండించారు. ఖమేనీ సజీవంగా ఉన్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరాన్ ప్రజలను ఉద్దేశించి ఖమేనీ మాట్లాడనున్నట్టు కూడా వార్తలు వెలువడుతున్నాయి.

# 23 మంది సజీవదహనం

(మొదటిపేజీ తరువాయి)

పెరువిషాదంతో కోనసీమతో పాటు తెలుగురాష్ట్రాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి.

**విషమంగా మరికొందరి పరిస్థితి..**

గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రులకు తరలించగా, వారిలో కొందరిని కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)కి తరలించి చికిత్స అందించారు. అయితే అక్కడ చికిత్స పొందుతున్న ఇద్దరు క్షతగాత్రులు కూడా మరణించడంతో మొత్తం మృతుల సంఖ్య 23కి పెరిగింది. మరికొందరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

**అధికారుల దర్యాప్తు..**

ఈ ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. బాణసంచా తయారీ కేంద్రంలో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అనే అంశంపై విచారణ కొనసాగుతోంది. తయారీ కేంద్రంలో పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలు నిల్వ ఉంచిన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో వేట్లపాలెం గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

**మృతుల వివరాలు...**

అడబాల శ్రీను, కడిపల్లి కృపమ్మ, ధనరాజు, సాధనాల సత్యవతి, వల్లూరి రవి, రాము, గంపల మంగ, గోడత మహేష్, మందపల్లి చిన్ని, నిమ్మడ కరుణ, గొట్ట మహేష్, రమణ, నాని

**ప్రధాని మోదీ దిగ్భ్రాంతి**

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు దుర్ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కష్ట కాలంలో బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చనిపోయినవాళ్లకు ఒక్కొక్కరికి రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడినవాళ్లు త్వరగా కోలుకోవాలని ప్రధాని ఆకాంక్షించారు.



**గతంలో భారీ పేలుళ్లు.. విషాదాలు**

బాణాసంచా తయారీ సందర్భాల్లో అనేక ప్రమాదాలు జిల్లాలో చోటు చేసుకున్నాయి. బాణా సంచా తయారీకి ప్రసిద్ధి చెందిన వేట్లపాలెం, పరిసర గ్రామాల్లో ఇలాంటి భారీ ప్రమాదాలు జరగడం, పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని వేట్లపాలెం, జువ్విపాడు, ద్రాక్షారామ, వేళంగి, రాయవరం, వి.సావరం, కొమరిపాలెం, బిక్కవోలు, మండపేట తదితర ప్రాంతాల్లో తయారీ కేంద్రాలున్నాయి. ఏడాది పొడవునా ఇక్కడి వ్యాపారులకు చేతినిండా పని ఉంటుంది. బాణసంచా తయారీ కోసం ఫారమ్ 20, కేవలం అమ్మకం కోసం ఫారమ్ 24 జారీ చేస్తారు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా సుమారు 50కి పైగా లైసెన్స్‌డ్ తయారీ కేంద్రాలు ఉన్నాయి. కాకినాడ జిల్లాలోని మండపేట, జువ్విపాడు, ద్రాక్షారామం, కొమరిపాలెం, రాయవరం, బిక్కవోలు, యు.కొత్తపల్లి మండలం వాకతిప్ప తదితర చోట్ల బాణసంచా కేంద్రాల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అయితే వాకతిప్పలో 2014 అక్టోబర్ 22వ తేదీన చోటు చేసుకున్న ఘటన ప్రమాదంలో 18 మంది మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాద ఘటన అనేక లోపాలను ఎత్తిచూపింది. కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం విలస గ్రామంలో కిరాణా షాపులో బాణసంచా పేలి భార్యాభర్తలు కంచర్ల శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి మృతిచెందారు. అలాగే గత ఏడాది రాయవరంలోని శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్‌స్‌లో జరిగిన భారీ పేలుడులో నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులు అక్కడిక్కడే మరణించారు

# ఇరాన్ వార్ ఎఫెక్ట్..

## బంగారం 2 లక్షలు.. వెండి రూ.4లక్షలు?

**హైదరాబాద్, మహా:** పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడులు చేయడం, దానికి ఇరాన్ ప్రతిదాడులు చేయడంతో పరిస్థితులు ఒక్కసారిగా ఆందోళనకరంగా మారాయి. ఈ యుద్ధ ప్రభావం నేరుగా వెండి, బంగారం మార్కెట్‌పై పడనుంది. కొద్ది రోజులుగా స్థిరంగా కొనసాగుతున్న బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే యుద్ధ ప్రభావం కారణంగా బంగారం, వెండి ధరల్లో భారీ పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,68,710కి చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే పది గ్రాములకు ఏకంగా రూ.7,140 మేర పెరిగింది. అలాగే 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,54,360కి చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే పది గ్రాములకు ఏకంగా రూ.6,530 మేర పెరిగింది. మరోవైపు వెండి ధర కిలోకు పది వేల రూపాయల మేర పెరిగి ప్రస్తుతం రూ.2.95 లక్షలుగా ఉంది. మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం.. మార్చి తొలి వారానికి బంగారం ప్రస్తుత ధరతో పోల్చుకుంటే 15 శాతం మేర పెరిగే అవకాశాలు కనబడుతున్నాయి. అంటే దాదాపు రూ.23 వేల నుంచి 25 వేల వరకు పెరగొచ్చు. సోమవారం మార్కెట్ ప్రారంభం కాగానే బంగారం ధరలో 10 శాతం పెరుగుదల ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. కొద్ది రోజుల్లోనే పది గ్రాముల బంగారం ధర తిరిగి రూ.2 లక్షలకు చేరువ అవుతుందని భావిస్తున్నారు. నిపుణుల అంచనా ప్రకారం.. కిలో వెండి స్వల్ప కాలంలో ప్రస్తుత ధరతో పోల్చుకుంటే రూ.30 నుంచి 50 వేల వరకు పెరగొచ్చు. యుద్ధం ఎంతకాలం కొనసాగితే, ధరల పెరుగుదల అంత తీవ్రంగా ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. వెండి తిరిగి తన చారిత్రాత్మక గరిష్ఠ స్థాయిలను దాటి రూ.4.2 లక్షలకు చేరినా ఆశ్చర్యపోనవసరం లేదని కొందరు అభిప్రాయపడుతున్నారు.


# తెలుగునాడుగా ఆంధ్రప్రదేశ్

## రాష్ట్రం పేరు మార్చాలని గరికిపాటి డిమాండ్

**అమలాపురం, మహా:** ఆంధ్రప్రదేశ్ పేరును మార్చాలని ప్రముఖ ప్రవచన కర్త, పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు డిమాండ్ చేశారు. తెలుగు భాషా సంస్కృతులను ప్రతిబింబించేలా ఈ పేరు ఉండాలని అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ప్రారంభమైన మూడవ ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ పేరును మార్చాలని కోరారు. 'ఆంధ్రప్రదేశ్' అనేది తెలుగు పదం కాదన్నారు. తమిళనాడు తరహాలో.. తెలుగు భాష, సంస్కృతులు, సంప్రదాయాలను ప్రతిబింబించేలా 'తెలుగు నాడు'అని పేరు పెట్టాలని సూచించారు. ఇది తెలుగువాళ్ల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని గరికిపాటి అన్నారు. ఇటీవలే కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. సమావేశాల్లో ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయన్నపాత్రుడు, సినీ నటుడు తనికెళ్ల భరణి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## దుబాయ్‌లలో బాంబుల మోత

దుబాయ్‌లోని ప్రపంచంలోని అత్యంత ఎత్తైన భవనం బుర్జ్ ఖలీఫాను అక్కడి ప్రభుత్వం ఖాళీ చేయించింది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కలిసి ఇరాన్ మీద దాడులకు పాల్పడుతోన్న విషయం తెలిసిందే. దీనితో ఇరాన్ యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌పై బాలిస్టిక్ క్షిపణిలను ప్రయోగించింది. ఈ క్రమంలో బుర్జ్ ఖలీఫా నుంచి ప్రజలను ఖాళీ చేయించారు. అమెరికా సైనిక సిబ్బందికి స్థావరంగా ఉన్న అల్ దఫ్రా వైమానిక స్థావరాన్ని ఇరాన్ దళాలు లక్ష్యంగా చేసుకోవడంతో అబుదాబి, దుబాయ్‌లలో బాంబుల మోత మోగింది. దుబాయ్‌లో భారీ పేలుడు శబ్దం వినిపించిందని, అయితే ఆ శబ్దం క్షిపణి దాడి వల్ల జరిగిందా లేక మరేదైనా కారణమా తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. దుబాయ్ బీచ్‌ల నుంచి దోహా వీధుల వరకు పేలుళ్ల శబ్ధాలు వినిపించడంతో ఇరాన్ ఒకేసారి వివిధ దేశాలలోని అమెరికా లక్ష్యాలపై దాడులు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. దుబాయ్ లో ఓ హోటల్ దగ్ధమైంది. చుట్టుపక్కల ప్రాంతాలన్నీ కంపించాయి.



# రేవంత్ రెడ్డి నిర్ణయంపై హరీశ్ రావు ప్రశంసలు

శారదాపీఠంకు కేటాయించిన
భూములు పీఠానికే చెందేలా సీఎం ఆదేశాలు
ముఖ్యమంత్రి ఆదేశాలు శుభపరిణామమన్న హరీష్ రావు



**హైదరాబాద్, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఒక నిర్ణయంపై బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. కోకాపేటలోని శారదాపీఠంకు కేటాయించిన భూములను తిరిగి పీఠానికే కొనసాగించాలని ఆదేశాలు ఇవ్వడంపై హరీశ్ రావు స్పందించారు. ముఖ్యమంత్రి ఆదేశాలు శుభపరిణామమని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కోకాపేటలో శారదా పీఠం భూములను జలమండలికి కేటాయించిన నిర్ణయాన్ని రద్దు చేయడం రాజ శ్యామలాదేవి అమ్మవారి కృపతో జరిగిన ధర్మ విజయమని, ఇది భక్తుల విజయమని పేర్కొన్నారు. ఆ అమ్మవారు ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సరైన బుద్ధి ప్రసాదించాలని అన్నారు. ఎలాంటి స్పష్టమైన ప్రజాప్రయోజన ప్రతిపాదిక లేకుండా పర్యావరణ నియమ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఖజానాకు తూట్లు పొడుస్తూ నామినేషన్ పద్ధతిలో మీ అల్లుడి అనుయాయులకి హెచ్ఎండీఏ ద్వారా కేటాయించిన 17 ఎకరాల భూమి సంగతి ఏమిటని హరీశ్ రావు ప్రశ్నించారు. ఆ భూమిలో కొనసాగుతున్న క్రషర్ యూనిట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రయోజనాలకు వ్యతిరేకంగా తీసుకునే రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.

# విమాన సర్వీసులు బంద్

## ఆపరేషనల్ అలర్ట్ లో విమానాశ్రయాలు

**మహా :** పశ్చిమాసియాలో ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికాల మధ్య భీకరంగా దాడులు జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు, సిబ్బంది భద్రత రీత్యా ఎయిర్ ఇండియా తన విమాన సర్వీసులన్నింటినీ నిలిపివేసింది. మరోవైపు దుబాయ్, జెడ్డా, దోహా, అబుదాబి, దమ్మామ్, బహ్రెయిన్, షార్జా, కువైట్, రస్ అల్‌ఖైమా నగరాలకు విమాన సర్వీసులు నిలిపివేస్తున్నట్లు ఇండిగో తెలిపింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రతకే తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేసింది. పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఇండిగో స్పష్టం చేసింది. భారత్‌తోపాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, దుబాయ్, టర్కీ సహా పలు దేశాలు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే దుబాయ్, దోహా వంటి అంతర్జాతీయ విమాన విమానాశ్రయాల్లోనే భారీ సంఖ్యలో ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఖతార్ గగనతలం మూసివేతతో, ఖతార్ ఎయిర్‌వేస్ దోహాకు వెళ్లే సర్వీసులను తాత్కాలికంగా ఆపేసింది. లెబనాన్, సిరియా, ఇరాక్, ఇరాన్, జోర్డాన్ దేశాలకు సోమవారం వరకు విమానాలను నిలిపివేసినట్లు టర్కిష్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. లండన్ నుంచి దుబాయ్‌కి వెళ్లే విమానాలను వర్జిన్ అట్లాంటిక్ ఎయిర్‌లైన్స్ రద్దు చేసింది. డచ్ విమానయాన సంస్థ కేఎల్ఎం ఆదివారం నుంచి టెల్ అవీవ్‌కు విమానాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఒకవేళ ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం మరింత ముదిరితే, రానున్న రోజుల్లో మరిన్ని విమాన సంస్థలు సర్వీసులను నిలిపివేసే అవకాశం ఉంది. ప్రస్తుతం




దేశంలోని ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయాలను అపరేషనల్ అలర్ట్‌లో ఉంచారు. విమానాల మళ్లింపు, అన్‌షెడ్యూల్డ్ ల్యాండింగ్‌లు సహా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవడానికి సర్వసన్నద్ధంగా ఉండాలని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), ప్రైవేట్ ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్లకు సూచించారు. గ్రౌండ్ హ్యాండ్లింగ్, పార్కింగ్ బేస్, ఇమ్మిగ్రేషన్ సపోర్ట్, క్రూ లాజిస్టిక్స్ విషయంలో విమానయాన సంస్థలతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.

**భీకర వార్ కొనసాగుతుందా?**

ఇరాన్ సైనిక, అణు స్థావరాలే లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్‌లు సంయుక్తంగా 'ఆపరేషన్ రోరింగ్ లయన్'ను చేపట్టాయి. దీనితో ఇరాన్ కూడా ప్రతిదాడులకు దిగింది. యుద్ధభయాలతో ఇరాన్, ఇజ్రాయెల్ సహా చాలా పశ్చిమాసియా దేశాలు తమ గగనతలాన్ని మూసివేశాయి. దీనితో అంతర్జాతీయ విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.




# హర్మూజ్ జలసంధిని మూసేసిన ఇరాన్

## ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం

**మహా :** ఇజ్రాయిల్‌ఇరాన్ యుద్ధం మిడిల్ ఈస్ట్‌లో సంక్షోభాన్ని సృష్టించింది. సుప్రీంలీడర్ ఖమేనీ అంతమే లక్ష్యంగా ఇజ్రాయిల్‌అమెరికా సంయుక్త దాడుల్ని శనివారం ప్రారంభించాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్ గల్ఫ్ లోని అమెరికా మిత్రదేశాలను టార్గెట్ చేసింది. కువైట్, యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. అబుదాబి, దుబాయ్, రియాద్ వంటి నగరాలపై డ్రోన్, మిస్సైల్ దాడులు నిర్వహించింది. ఇదిలా ఉంటే, తాజాగా ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. చమురు రవాణాకు అత్యంత కీలకంగా ఉన్న ''హర్మూజ్ జలసంధి''ని మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. హోర్ముజ్ జలసంధి గుండా ఎటువంటి నౌకకు అనుమతి లేదని ఇరాన్ గార్డులు నౌకలకు చెబుతున్నారని ఈయూ నావికా దళం పేర్కొంది. ప్రపంచంలోని రోజువారీ చమురు వినియోగంలో 20 శాతం ఈ హోర్మూజ్ జలసంధి నుంచే ప్రయాణిస్తుంటుంది. ఈ జలసంధిని మూసేయడం ద్వారా తమ ప్రపంచంపై ఇరాన్ ఒత్తిడి పెడుతోంది.

# భూభారతి భారీ స్కామ్

- ఈ స్కామ్ పై సిట్, సీఐడీ వేయండి
- బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్ రావు డిమాండ్

**జనగామ, మహా :** కాంగ్రెస్ సర్కార్ భూభారతి పేరుతో భారీ స్కామ్ చేస్తోందన్నారు. నిషేధిత భూముల జాబితాను పెంచుకుంటూ వసూళ్లకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్ రావు విమర్శించారు. సెటిల్‌మెంట్ అయిన తర్వాత నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తున్నారని అన్నారు. విలువైన భూములను నిషేధిత జాబితాలో చేర్చి అక్రమ వసూళ్లు చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. భూభారతి స్కామ్‌లో అసలు నిజాలను బయటకు రానివ్వట్లేదని విమర్శించారు. 35 మండలాల్లో ఈ స్కామ్ జరిగిందని, భూభారతి పోర్టల్‌లో ఎడిట్ ఆప్షన్ ఆపరేటర్లకు ఎలా దొరికిందని మాజీ మంత్రి ప్రశ్నించారు. అమాయక రైతులకు నోటీసులు ఇచ్చి భయపెడుతున్నారని మండిపడ్డారు. లక్ష ఎకరాల ఎస్సీ, ఎస్టీ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని ఆరోపించారు. ఎన్నికల ముందు పట్టాలిస్తామని చెప్పి, ఇప్పుడు స్వాధీనం చేసుకున్నారని మాజీ మంత్రి విమర్శించారు. 'మా మీద సిట్‌లు వేసే బదులు ఈ స్కామ్‌పై సిట్, సిఐడీ విచారణ చేయాలి' అని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం భీమారంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యా బోధన అందిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే భోజనం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నిత్యావసర సరుకులను వినియోగించాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. 10వ తరగతి వార్షిక పరీక్షల సమీపిస్తున్నందున విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని, సులభంగా జీర్ణమయ్యే ఆహారం అందించాలని సూచించారు. పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులు తయారు చేసిన మట్టి ఆకృతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దొంగ నోట్లు చెలామణి చేస్తున్న 11 మంది ముఠా అరెస్టు

- **సిసిటీవీ ఫుటేజ్ లతో టక్కున పట్టిన లక్షెట్టి పేట సీఐ**
- **ఒకే నంబర్ 500 నోట్లతో బయటకి వచ్చిన వ్యవహారం**



**మంచిర్యాల, మహా :** దొంగ నోట్లు చెలామణి చేస్తున్న 14 మంది ముఠా గుట్టును రట్టు చేసినట్లు లక్షెట్టిపేట సీఐ డి రమణమూర్తి వెల్లడించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సిఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిబ్రవరి 25 నాడు హాజీపూర్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఒక షిఫ్ట్ కారులో 1500 రూపాయలు డిజిల్ పోసుకొని ఒకే నంబర్ తో కూడిన మూడు 500 రూపాయల నోట్లు సేల్స్ మెన్ మహిళకు ఇచ్చినట్లు చెప్పారు. ఆ తర్వాత వాటిని ఆమె పరిశీలించగా 500 రూపాయలు 9FV 230854 నంబర్ గలవి మూడు ఉండడంతో అవి నకిలీమని గమనించారని తెలిపారు. ఆ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి సీసీటీవీ కెమెరా ఫుటేజ్ లను పెట్రోల్ పంపు యాజమాన్యం అందజేసిందని ఆయన వివరించారు. ఫిర్యాదునందుకున్న తాము ఇటికాలకు చెందిన కానుగంటి క్రాంతి, గాడి గొప్పుల రవీందర్,శ్రీరామ్ పూర్ కు చెందినతాంద్ర ప్రకాష్,కోన మధుకర్ (వెంకట్రావు పేట),సుంక సురేష్( గోదావరిఖని), కమాని అనిల్ (సుల్తానాబాద్) బండారి సత్యనారాయణ (రంగపేట),ఐ. హెచ్. రాము నాయక్ బెంగళూరు బేకరీ, (లక్సెట్టిపేట్)కందిమల్ల తిరుపతి (జెండావెంకటపూర్),గొల్ల కుమార స్వామి (పెరికపల్లి) జిల్లా పెద్దపల్లి, నగునూరి రాము (లక్సెట్టిపేట్), దేవనబోయిన సంపత్ కుమార్ బెజ్జంకి జిల్లా తిమ్మయ్య పల్లి గ్రామం (సిద్దిపేట),రాము (కాకినాడ), రవి కాకినాడలపై సిఆర్ నంబర్ 61/26 యు/ఎస్.ఈ. సి.179, 180, 318(4) బి.ఎన్.ఎస్. ఆఫ్. పి.ఎస్. నమోదు చేసినట్లు తెలిపారు. పైన తెలిపిన నిందితులు ఒకటి నుండి ఆరు వరకు గల వ్యక్తులు కాకినాడకు వెళ్లి రాము, రవిల దగ్గరికి వెళ్లి 6 లక్షల రూపాయలు నకిలీ నోట్లను లక్సెట్టిపేటకు తీసుకువచ్చినట్లు తెలిపారు. వీటిని చలామణి చేసేందుకు ప్రయత్నం చేస్తుండగా తాము చాకచక్యంగా పట్టుకున్నట్లు స్పష్టం చేశారు. నిందితులనుండి 5 లక్షల 98,500 రూపాయల నకిలీ నోట్లు, రెండు వాహనాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. పరారీలో ఉన్న వారిని త్వరలో పట్టుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ ముఠాను పట్టుకోవడంలో చాక చక్యంగా వ్యవహరించిన సిఐ రమణమూర్తిని, ఎస్.ఐ.జి సురేష్, పోలీస్ సిబ్బందిని మంచిర్యాల ఏసీబీ డీసీపీలు అభినందించారు.

# శభాష్ రాజేందర్ అన్న..

- **కార్పొరేషన్ ఎన్నికల్లో చాలా కష్టపడి పనిచేశారు..**
- **మంచి ఫలితాలు సాధించారు..**
- **కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పెంచారు..**
- **కీప్ ఇట్ అప్..**
- **వెలిచాల రాజేందర్రావును అభినందించిన ముఖ్యమంత్రి**
- **పలు అంశాలపై దిశా నిర్దేశం చేసిన ముఖ్యమంత్రి**



**కరీంనగర్ మహా :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వెలిచాల రాజేందర్ రావు చాలా బాగా పనిచేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. శనివారం హైదరాబాదులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి వెలిచాల రాజేందర్రావు మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం.. ప్రచారం తీరు.. ప్రత్యేకంగా చేపట్టిన ప్రణాళిక.. ఎన్నికల ఫలితాలు.. తధానంతర పరిణామాలు..కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పెరగడం.. గతంలో 0 నుంచి 14 సీట్ల వరకు కాంగ్రెస్ పార్టీ ఎదగడం.. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై రాజేందర్రావు ముఖ్యమంత్రితో చర్చించారు. అన్ని విషయాలను ముఖ్యమంత్రి ఓపిగ్గా విన్నారు. రాజేందర్ రావు కు ముఖ్యమంత్రి కొన్ని సూచనలు సలహాలు అందించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రాజేందర్ అన్న మీరు చాలా బాగా పనిచేశారు. ప్రజల్లో మీ మీద మంచి అభిప్రాయం ఉంది. పార్టీ గ్రాఫ్ పెంచారు. పట్టుదలతో పని చేస్తూ, మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతున్నారనీ వెన్ను తట్టి ప్రోత్సహించారు. ఎమ్మెల్యే ఎన్నికల వరకు ప్రజల్లోనే ఉండి ఇంకా పార్టీ గ్రాఫ్‌ను పెంచాలని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీలో చేరికలు



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ జోన్ పరిధిలోని తొండుపల్లి నుండి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాచమల్ల జయసింహ, కొన్న మొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీగా యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు.బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దిద్యాల శ్రీనివాస్ సమక్షంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి లు పార్టీ కండువా కప్పి శనివారం యువకులను పార్టీలోకి ఆహ్వానించారు. తుప్పరా సునీల్, మంద శివ, బూర్గుల అశోక్, క్రిష్ణ, రాచమల్ల వెంకటేష్,రవీందర్,మదన్,జీవన్,నిఖిల్, నితిన్,ఋతిక్,తుప్పర హరి,కిషోర్,మంద మధు,దేశపగ మహేందర్,రాహుల్ పాల్ బిఆర్ఎస్ పార్టీలో జాయిన్ అయ్యారు.ఈ కార్యక్రమంలోకుమ్మరి అర్జున్, గిరి, చిలకమర్రి పరందాములు,రాచమల్ల రమేష్, పేదిరిపాటి మురళి,గౌస్ అలి,ఫాతిమా ,కొండ దర్శన్ గౌడ్,రమేష్ రాథోడ్,పోతుగంటి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ని సందర్శించిన జోనల్ కమిషనర్ మంద మకరంద్



**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో జిహెచ్ఎంసి అధికారులతో కలిసి రాజేంద్రనగర్ నూతన జోనల్ కమిషనర్ మంద మకరంద్ శనివారం కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో బ్యాట్మెంటన్ కోర్టు, స్కేటింగ్ మైదానం, స్విమ్మింగ్ లను అధికారులతో కలిసి పరిశీలించారు. క్రీడాకారులకు కావలసిన వస్తువులపై ఆరా తీశారు. క్రీడా మైదానాలు పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

**అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యతను పాటించాలి.. రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



**రంగా రెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆహార భద్రత చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్, హయత్ నగర్ మండలంలో క్షేత్ర పర్యటన నిర్వహించారు.ఈ సందర్భంగా చౌక ధర దుకాణాలను, అంగన్వాడి కేంద్రాన్ని, విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ హాస్టల్, స్కూల్, వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ ను కమిషన్ సభ్యులు ఆనంద్, శారద, భారతి, జ్యోతిలతో కలిసి రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా చైర్మన్ జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు.చైర్మన్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, అంగన్వాడీలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రణాళిక బద్ధంగా మెనూ ను రూపొందించిందని, దానికి అనుగుణంగా మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ఆహార భద్రత చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. లబ్దిదారులకు చట్ట బద్ధమైన హక్కులు అమలు చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, బరువు తక్కువ ఉన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు కోడిగుడ్లు, పోషకాహారం కచ్చితంగా అందించాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు. స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల రిజిస్టర్లు, కేటాయింపు ఉత్తర్వులు, ఈపోస్ లావాదేవీలను పరిశీలించారు. లబ్దిదారులకు బియ్యం సకాలంలో అందుతున్నాయా, అక్రమాలు జరుగుతున్నాయా అనే అంశాలపై వివరాలు తీసుకున్నారు. ఐసిడిఎస్, పీఎం పోషణ పథకాల అమలు, పోషకాహార సరఫరా నాణ్యత, ప్రసూతి ప్రయోజన పథకం అమలు, ఎన్ఎఫ్ఎస్ఏ కింద అర్హ కుటుంబాల గుర్తింపు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పనితీరు, సామాజి క తనిఖీలు, విజిలెన్స్ కమిటీల పనితీరు, గోదాముల పరిస్థితి, నాణ్యత సంరక్షణ చర్యలపై చర్చించారు. నాణ్యమైన ఆహార ధాన్యాలు పారదర్శకంగా, సకాలంలో లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల, విద్యార్థుల సమస్యలను తెలిపేందుకు పాఠశాల, చౌక ధర దుకాణాల ఆవరణలో అధికారుల ఫోన్ నెంబర్లతో కూడిన ఫిర్యాదు పట్టికను అమర్చాలని అధికారులకు సూచించారు. అంగన్వాడీలలో పిల్లలతో పాటు గర్భిణీ స్త్రీలకు పోషకాహారాన్ని అందించాలని చైర్మన్ సూచించారు. ఎప్పటికప్పుడు రేషన్ నిల్వలను రిజిస్టర్లలో నమోదు చేయాలని అదేవిధంగా సరుకులపై గడువు తేదీని పరిశీలించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ కమిషన్ చైర్మన్ పర్యటనలో ఆర్డీఓలు అనంత్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, డిఇఓ సుసిందర్ రావు, డీఎంహెచ్ఓ లలితా దేవి, జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత, జిల్లా మేనేజర్ హరీష్, సంక్షేమ శాఖ అధికారులు రామారావు, రామేశ్వరి దేవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



**కోకాపేట శారద పీఠానికి రెండెకరాల**

# భూ కేటాయింపు!

**భూమి కేటాయిస్తున్నట్లు ఎమ్మార్వో వెల్లడి..**

**రాజేంద్రనగర్ మహా:** కోకాపేట్ సమీపంలో నియో పోలీస్ దగ్గర విశాఖ శారదా పీఠం స్థలాన్ని ప్రభుత్వం తీసుకోవడంతో. కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగాదానికి బదులుగా శంషాబాద్ జోన్ పరిధిలోని సర్వేనెంబర్ 725 /19 లో హెచ్ఎండిఏ కు చెందిన రెండు ఎకరాల భూమిని వారికి కేటాయించడం జరిగిందని ఎమ్మార్వో రవీందర్ దత్ సమావేశంలో తెలిపారు. విశాఖ శారద పీఠానికి కేటాయించిన భూమిలో త్వరలోనే అద్దు బందులు ఏర్పాటుచేసి,రెండు ఎకరాలు స్థలాన్ని వారికి అప్పజెప్తామన్నారు.\హెచ్ఎండిఏ కు సంబంధించిన 180 పైచిలుకు ఎకరాల భూమి ఉంది. అందులో సుమారు 100కు పైగా ప్రభుత్వ ఆధీనంలో ఉందన్నారు. మిగతా భూములు కోర్టు కేసులలో ఉన్నాయని తెలిపారు.



**ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో**

# రవిచంద్రకు చోటు

**ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో రచయిత, సినీ విమర్శకులు డా. పొన్నం రవిచంద్ర కు చోటు లభించింది**

**కరీంనగర్ మహా:** సీనియర్ జర్నలిస్టుగా, రచయితగా కవిగా, సినిమా పరిశోధకుడిగా, పలుచిత్రోత్సవాలకు జ్యూరీ సభ్యుడిగా పని చేయడంతో పాటు, నంది, గద్దర్ అవార్డులు అందుకున్న పొన్నం రవిచంద్రకు లైఫ్ టైం లిటరరీ, వాయిస్ ఆఫ్ సినిమా అవార్డు ను ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఫౌండర్ ఎడిటర్ డా. కె. వివేకానంద బాబు ప్రకటించారు. హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, తెలుగు సినిమా రచయిత కె.వి. విజయేంద్రప్రసాద్ చేతులమీదుగా ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు డా. హరి కుమార్, డా. భూపాల్ నానావత్, డా. పావని ఈ అవార్డు ను అందించారు. ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రవిచంద్ర ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆయన ఈ అవార్డుకు ఎంపిక చేసిన వివేకానంద బాబు ను అభినందించారు. రవిచంద్ర ఈ మైలురాయికి చేరుకోవడం పట్ల జి వి శ్యాంప్రసాద్ లాల్, మామిడి హరికృష్ణ, మాడభూషి శ్రీధర్, వేణు ఉడుగుల, అల్లాణి శ్రీధర్, సి వి నవీన్ కుమార్ కత్తి చేతన్,తాళ్ళపల్లి శ్రీనివాస్ గౌడ్, యాగండ్ల అనిల్ గౌడ్, గౌని తిరుపతి, ఐనంపూడి శ్రీలక్ష్మి, అన్నవరం దేవేందర్, మాడిశెట్టి గోపాల్, పి ఎస్ రవీంద్ర, గాజోజు నాగభూషణం, కూకట్ల తిరుపతి, నంది శ్రీనివాస్ కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన : టిజిఓస్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** టిజిఓ అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్ ను ఆవిష్కరించిన టిజిఓ సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరు శ్రీనివాస రావు, శ్యామ్. రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం మహిళా విభాగం చైర్ పర్సన్ రేవతి ఆధ్వర్యంలో శనివారం టిజిఓ 'స్ భవన్ లో రంగారెడ్డి జిల్లా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉత్సవాల పోస్టర్ ను టిజిఓ 'స్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి,మహిళా విభాగం రాష్ట్ర కోశాధికారి శాంతి శ్రీ, శిరీష, నరహరి, షౌకత్ మొదలగువారు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్



**ఆమనగల్లు, మహా :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డిని ఆమనగలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్ కలిశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు రక్షణ చట్టం అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని కోరుతూ అలంపూర్ నుంచి సెక్రటేరియట్ వరకు న్యాయవాదులు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం సెక్రటేరియట్లో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని న్యాయవాదుల బృందం కలిసి వినతిపత్రం అందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని అమనగలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాలు తెలిపారు.

# చంద్రగ్రహణం ఆలయాలు బంద్



**ఆమనగల్లు, మహా :** చంద్రగ్రహణం దృష్ట్యా మార్చి 3న కడ్తాల్లోని మైసిగండి మైసమ్మ ఆలయంతో పాటు శివాలయ,రామాలయాలు మూసివేస్తున్నట్లు ఆలయ ఈవో స్నేహలత చెప్పారు. మూడో తేదీ ఉదయం ఏడు గంటల నుంచి 4వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఆలయాలను మూసివేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆలయ శుద్ధి, అభిషేకం, అలంకరణ అనంతరం భక్తుల దర్శనానికి అనుమతిస్తామని చెప్పారు. గ్రహణం దృష్ట్యా నగరంలోని ప్రముఖ ఆలయాలను సైతం మూసివేయనున్నారు.

# ప్రజా సమస్యలపై దృష్టి



**ఆమనగల్లు, మహా :** అమనగల్లు మున్సిపాలిటీ 3వ వార్డు నుచ్చుగుట్ట, వేములకుంట, సాకిబండ తండా ప్రాంతాల్లో మున్సిపల్ ఛైర్మన్ డా.పత్య నాయక్, వైస్ ఛైర్మన్ తల్లోజు గీతా ఆచారితో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి స్థానిక సమస్యలుతెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఛైర్మన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శంకర్ నాయక్,అధికారులు ఉన్నారు.

## ప్రభుత్వాలు బిల్లులను సకాలంలో చెల్లించి బిల్డర్లను ఆదుకోవాలి

**బిల్డర్ అసోసియేషన్ సభ్యులు, డి వి ఎన్ రెడ్డి..**

**రాజేంద్రనగర్ మహా ;** రైసింగ్ బిల్డర్స్ అసోసియేషన్ చేపట్టిన 202526 బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 4వ నేషనల్ మేనేజింగ్ కమిటీ జనరల్ కౌన్సిల్ సమావేశం శంషాబాద్ ఎయిర్పోర్ట్ పక్కన పద్మజ పాల్మ్ గ్రోవ్స్ రిసార్ట్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికిముఖ్య అతిథిలు గా రాష్ట్ర రోడ్డు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. బిల్డర్ అసోసియేషన్ సభ్యులు డివిఎన్ రెడ్డి మాట్లాడుతూ బిల్డర్ అసోసియేషన్ అనేది 1941లో పూణేలో ప్రారంభించాము. ఇదీ దేశంలోనే అతి పెద్ద నిర్మాణ రంగ సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. నిర్మాణ రంగంలో బిల్డర్స్ (కాంట్రాక్టర్లు ) ఎదుర్కొంటున్న పెండింగ్ బిల్లుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని మంత్రులను కోరారు.ప్రతి నెల నిర్ణీత గడువులోగా బిల్లులు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ఉత్తమ (ఇంజనీర్లు) నిపుణులకు అవార్డులు ప్రధానం చేశారు. చీనాబ్ వంతెనను నిర్మించిన ఇంజనీర్ మాధవి లత, నల్గొండకు చెందిన ప్రజా గాయకుడు నల్గొండ గద్దర్ ని సత్కరించారు.ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు 260 కేంద్రాల నుండి ఇంజనీర్లు, బిల్డర్స్, వారి ప్రతినిధులు తరలివచ్చారు.ప్రభుత్వం తలపెట్టిన రైజింగ్ తెలంగాణాలో బిల్డర్స్ అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందిఅన్నారు. కోటి లోపు ఉన్న చిన్న కాంట్రాక్టర్ల బిల్లులను వెంటనే చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను వారు కోరారు.



**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా**

## శ్రీనివాస్ రావు బాధ్యతల స్వీకరణ

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల ఆర్డీవో గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుకు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవన సముదాయంలోని ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా పని చేసిన పి చంద్రయ్య పదోన్నతిపై జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గా విధులు నిర్వహిస్తున్నారు.



**విద్యార్థులు సృజనాత్మకతను**

# పెంచుకోవాలి

**బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావస్వాతి రమేష్**

**బెల్లంపల్లి, మహా:** విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకొని భవిష్యత్తులో రాణించాలని బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ పేర్కొన్నారు. శనివారం రోజు ఆమె బెల్లంపల్లి పట్టణంలోని సెయింట్ మేరీస్కూల్లో ఏనిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన శాస్త్రీయన మూనాలను పరిశీలించారు.ఆనంతరం ఆమెతోపాటు పలువురు కౌన్సిలర్లు కూడా హాజరై విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నమూనాలను పరిశీలించారు. విద్యార్థుల సృజనాత్మకత, విజ్ఞాన ప్రతిభను అభినందిస్తూ భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు.



## బెల్లంపల్లి ఘనంగా టైలర్స్ డే కార్యక్రమం

**బెల్లంపల్లి పట్టణ టైలర్స్ కార్మిక సంఘం అధ్యక్షుడు గెల్లి రాజలింగు ఆధ్వర్యంలో**

**బెల్లంపల్లి మహా** బెల్లంపల్లి పట్టణంలోని టైలర్స్ కార్మిక సంఘం అధ్యక్షుడు గల్లీ రాజలింగు ఆధ్వర్యంలో శనివారం రోజు టైలర్స్ డే కార్యక్రమాన్ని హనుమాన్ బస్తి హనుమాన్ మందిర్ లో ఘనంగా నిర్వహించారు. ప్రపంచానికి కుట్టు మిషన్ పరిచయం చేసిన విలియం హోవే సంస్కరణార్థం ఆయన జ్ఞాపకార్థంగా టైలర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టైలర్స్ కార్మిక సంఘం అధ్యక్షుడు గెల్లీ రాజలింగు పేర్కొన్నారు. తొలుత విలియం హోవే చిత్రపటానికి పూలమాలను అలంకరించి ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ 1860 దశకంలో నేడు విరివిగా వినియోగిస్తున్న కుట్టు మిషన్ యంత్రాన్ని కనుగొని పలువురికి మార్గదర్శకుడయ్యాడని పేర్కొన్నాడు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో టైలర్స్ వృత్తి అనేది కష్టతరంగా మారిందని రెడీమేడ్ యంత్రాలు రావడంతో టైలర్స్ వృత్తిని నమ్ముకున్న వ్యక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వంసానుకూల దృష్టితో టైలర్స్ ను ఆదుకునే చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు టైలర్స్ కార్మిక సంఘం నాయకులు కీర్తి శ్రీనివాస్, కీర్తి లక్ష్మి, దాసరి సుదర్శన్, దాసరి శ్రీనివాస్, గట్ల విజయ,కీర్తి లావణ్య,ఆత్మకూరి స్వప్న తోపాటు అధిక సంఖ్యలో టైలర్స్ కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి

**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ కి చెందిన ఎండి అబ్దుల్ రఫీ దంపతులు హైదరాబాద్ పట్టణానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో సిద్దిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన ప్రయాణిస్తున్న కారు లారీకి ఢీకొనడంతో అక్కడికక్కడే శనివారం రోజుమృతి చెందారు. దీంతో ఆయన కుటుంబీకులు కన్నీళ్ళ పర్యంతమయ్యారు.





# అజాతశత్రువు మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు యాదిలో...

## వివాదరహితుడు ప్రజల ఆత్మబంధువు.. మార్చి 2వ తేదీన శ్రీపాదరావు జయంతి

పదవితో ఆయన పెద్దవారు కాలేదు. ప్రజల మద్దతు ఆయనను మహానాయకుడిగా నిలిపింది. ప్రతి గ్రామంలో కనీసం వంద మందిని మందిని పేరుపేరునా పలకరించేవారు. ప్రత్యర్థులనూ సోదరుల్లా ఆప్యాయంగా చూడగలిగారు. రాజకీయాల్లో అరుదైన ఘనత సాధించారు. మంథని నేలపై అభివృద్ధి అనే దీపాన్ని వెలిగించేందుకు, అరణ్య ప్రాంతాల్లో ఆశ అనే విత్తనాలు నాటేందుకు ఆయన చేసిన కృషి అమోఘం. అది ఒక తపస్సు లాగా సాగింది. నక్సల్స్ ప్రాబల్యం ఉన్న ప్రాంతంలోనూ “మా సమస్యలు వినాలి” అన్న పిలుపు వినగానే ఒంటరిగా ముందడుగు వేసిన నాయకత్వం.. ప్రజల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతకు నిదర్శనం. ఆ అడుగు తిరిగి రాకపోయినా, ఆయన జ్ఞాపకం ప్రతి హృదయంలో చిరస్థాయిగా నిలిచింది. చెరగని ముద్ర వేసుకున్నారు. ఆ మహానేత ఒక నాయకుడు మాత్రమే కాదు.. విశ్వాసానికి ప్రతి రూపం రాజకీయ విలువలకు ప్రతీక ఆ మహానేత.

అడవుల అంచుల్లో భయం రాజ్యమేలుతున్న కాలంలో, ప్రజల కోసం భయాన్ని తలదన్నిన ఒకే ఒక్క అడుగు.. ప్రతి గ్రామం ఆయనకు ఓ కుటుంబం... ప్రతి మనిషి ఆయనకు ఓ బంధువు. రాజకీయాల్లో ప్రత్యర్థులుండొచ్చు కానీ శత్రువులుండకూడదని జీవించి చూపిన అజాతశత్రువు. అరణ్యానికే అభివృద్ధి దిశ చూపించి, చివరికి అదే అరణ్యంలో అమరుడైన ప్రజానాయకుడు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు కు స్వరాష్ట్రంలో అరుదైన అధికారిక గౌరవం దక్కింది. శ్రీపాదరావు జయంతిని మార్చి 2 న స్టేట్ ఫంక్షన్ గా నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2024లో ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తున్నారు.

అసెంబ్లీని సమర్థవంతంగా నడిపించిన నాయకుడు.. విపక్షాల విశ్వాసం చూరగొన్న నేత.. స్వపక్షం తో పాటు విపక్షాలకు సమానంగా అవకాశం కల్పించిన మహానుభావుడు.. అసెంబ్లీ లో సభ ఔన్నత్యాన్ని దశ దిశల చాటిన సమర్థవంతమైన స్పీకర్ గా పేరు సంపాదించుకున్నారు. అందరి విశ్వాసము ప్రేమ అభిమానాలు చురగొన్న మహనీయుడు.. అలాంటి నేతలు రాజకీయాల్లో చాలా అరుదుగా కనిపిస్తుంటారు. ఇందులో ప్రధానంగా ఆ మహానేత నిలుస్తారు.. ఇంతకీ ఆ నేత ఎవరంటే మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు.. మార్చి రెండో తేదీన ఆ మహానేత జయంతి. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను మరోసారి గుర్తు చేసుకుందాం.



### రాజకీయ నేపథ్యం..

రెండుసార్లు ధన్వాడ సర్పంచ్ గా మహాదేవ పూర్ సమితి బ్లాక్ ఉపాధ్యక్షుడిగా, ఎల్ఎంబి చైర్మన్ గా నిరంతరం ప్రజాక్షేత్రంలో మమైకమై 1983 లో తెలుగుదేశం పార్టీ ప్రభంజనంలోనూ తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. భారతరత్న స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి. పీవీ నరసింహారావు తో కుటుంబ పరంగా రాజకీయంగా స్నేహ సంబంధాలు ఉన్నాయి. విపక్షాలతోను సన్నిహిత సంబంధాలు ఉండేవి. ప్రజలందరితోను ఆప్యాయత అనురాగంతో పలకరించేవారు.



### శ్రీపాదరావు నేపథ్యం..

ఒకప్పటి కరీంనగర్ జిల్లా ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దన్వాడ గ్రామంలో 1937 మార్చి 2 న మౌళి పటేల్ రాధాకృష్ణయ్య కమల భాయ్ దంపతులకు శ్రీపాదరావు జన్మించారు. నాగ్ పూర్ లో న్యాయ విద్యనభ్యసించారు. తెలుగుదేశం పార్టీ ప్రభంజనం లో 1983లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు మంథని నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

### మంథని అభివృద్ధిలో కీలకపాత్ర..

దట్టమైన కీకారణ్యం , పీపుల్స్ వార్ నక్సల్స్ ప్రాబల్యం గల. మంథని నియోజకవర్గంలో. సాగు, తాగు నీటి సమస్యలతో పాటు విద్యా, వైద్య సదుపాయలు, రహదారుల అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన కోసం పట్టు పురుగుల పెంపక కేంద్రం తదితర అభివృద్ధి పనులు నక్సల్స్ ప్రాంతంలో చేపట్టిన ఘనత శ్రీపాద రావు ది. మంథని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోనే మంథని ఉండేది. మంథని అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించారు శ్రీపాదరావు. ప్రజలకు ఏ అవసరం ఉన్నా వెంట వెంటనే తీర్చే వారు ఆపదలో సంపదలో నిత్యం ప్రజల వెంటే ఉండేవారు. ప్రజల సాధక బాధకాల్లో వెంబడి ఉండి సమస్యలు పరిష్కరించే వరకు అధికారులను విడిచి పెట్టేవారు కాదు. ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పరితపించేవారు..

### మంథని అభివృద్ధిలో..

ఆధునిక వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటు పట్ల మంథని ప్రాంత రైతాంగాన్ని చైతన్య పరచడం కోసం శ్రీపాద రావు ఎనలేని కృషి చేశారు. ఈ నియోజకవర్గ ప్రజలు శ్రీపాదరావు ను ‘ బుచ్చి పంతులు’ అని ప్రేమగా పిలుస్తారు.. బుచ్చి పంతులు అనే పేరు తెలియని వారు మంథని నియోజకవర్గంలో ఉండరు. అంతగా ప్రేమ అభిమానాలు సంపాదించుకున్నారు శ్రీపాదరావు. రాజకీయ పరంగా శ్రీపాదరావును వ్యతిరేకించే వారిని సైతం ఆయన పలకరించేవారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో కనీసం 100 మందిని పేరుపేరునా పిలిచే సంబంధాలు కలిగి ఉన్న శ్రీపాదరావు. అజాతశత్రువుగా గుర్తింపు పొందారు.

1991 ఆగస్టు నుంచి, జనవరి 1995 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్ గా శ్రీపాదరావు కొనసాగారు. అసెంబ్లీ స్పీకర్గా మృదు స్వభావంతో వ్యవహరించి అందరి మన్ననలు పొందారు. ఒకవైపు స్పీకర్ గా రాష్ట్రంలో బాధ్యతలు నిర్వర్తిస్తూనే నియోజకవర్గ అభివృద్ధిని మాత్రం ఏనాడు విడువలేదు.. నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగారు. వివాదరహితుడిగా మంచి పేరు సంపాదించుకున్నారు. ప్రజా సమస్యలను దగ్గర్నుంచి చూస్తూ పరిష్కారానికి కృషి చేశారు. పొగడ్తలకు పొంగిపోకుండా విమర్శలను పట్టించుకోకుండా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో స్పీకర్ గా పనిచేసిన శ్రీపాదరావు అసెంబ్లీ హుందాతనాన్ని కాపాడారు. సమర్థవంతంగా సభను నిర్వర్తించారు. ఎంతో పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారు. ప్రతిపక్షాల మనసును గెలుచుకున్నారు. స్పీకర్ శ్రీపాదరావు తర్వాత వచ్చిన స్పీకర్లు ఆయన బాటలోనే పయనించారు. ఆయన చూపిన మార్గాన్ని ఎంచుకొని సమర్థవంతంగా సభ నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించారు. మహాదేవపూర్ మండలం అటవీ గ్రామమైన అన్నారంలో ఓ కాంగ్రెస్ కార్యకర్త ఇంట్లో ఓ కార్యక్రమానికి 1999 ఏప్రిల్ 13న శ్రీపాదరావు అడవి మార్గం గుండా వెళ్లారు. ఆ దారిలో వార్ నక్సలైట్లు శ్రీపాదరావు ప్రయాణిస్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. ‘మా సమస్యల గురించి మీతో మాట్లాడాలి’ మాతో మీరు ఒంటరిగా రావాలని శ్రీపాదరావు నక్సలైట్లు కోరారు. ఆయన వెంట ఉన్న అనుచరులను మీరు రావద్దని ఆదేశించారు. అనేక సందర్భాల్లో పలువురు వార్ సానుభూతిపరులను, మిలిటెంట్లను పోలీస్ స్టేషన్, కేసుల నుంచి, శ్రీపాదరావు విడిపించారు. ఎంతోమందికి అండగా నిలిచారు. సహాయం అందించారు. ఈ నేపథ్యంలో సార్ తో నక్సల్స్ మాట్లాడుతారని అనుచరులు అక్కడ ఆగిపోయారు. కొన్ని గంటల వ్యవధిలోని శ్రీపాదరావు ను హతమార్చిన సమాచారం బయటికి ప్రపంచానికి తెలిసింది. మంథని ప్రాంతం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైంది. మహానేత లేరనే విషయాన్ని ప్రజలు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు జీర్ణించుకోలేకపోయారు. కన్నీరు మున్నీరుగా విలపించారు. అప్పటి కాంగ్రెస్ ప్రతిపక్ష నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, సీఎం చంద్రబాబు నాయుడు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి శ్రీపాద రావుకు శ్రద్ధాంజలి ఘటించారు. శ్రీపాదరావు ఉన్నంతకాలం ఆయన కుటుంబ సభ్యులు కుమారులు రాజకీయాల్లో జోక్యం చేసుకోలేదు. శ్రీపాదరావు చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం గౌరవభావంతో జిల్లాలోని ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకానికి శ్రీపాదరావు ప్రాజెక్టుగా నామకరణం చేసింది. కాలేశ్వర క్షేత్రం అభివృద్ధిలోనూ శ్రీపాద రావు పాత్ర కీలకంగా ఉంది. మంథని అభివృద్ధికి దారి దీపం శ్రీపాదరావు.. శ్రీపాద రావుకి శ్రీ దత్తాత్రేయ స్వామి ఇష్ట దైవం, ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఇంటిబి ఇలవేల్పు. ఆయా దేవాలయాల్లో అనేకమార్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీపాదరావు ఒక నాయకుడు మాత్రమే కాదు రాజకీయ విలువలకు ప్రతీక విశ్వాసానికి ప్రతిరూపం.. అజాతశత్రువు మహానుభావుడు. శ్రీపాదరావు జీవితం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకం.. శ్రీపాదరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాల్సిన అవసరం ఎంతైనా.. ఆయన చూపిన మార్గం అనుసరణీయం. ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరు. వివాదరహితుడు నిస్వార్థ రాజకీయ నాయకుడు శ్రీపాద రావు లాంటి నేతలు రాజకీయాల్లో చాలా అరుదుగా ఉంటారు.. శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఆ మహానేతకు ఇదే నిజమైన నివాళి..



### తండ్రి బాటలో తనయుడు దుద్దిల్ల శ్రీధర్ బాబు..

తండ్రి శ్రీపాదరావు అకస్మిక మరణంతో రాజకీయాల్లోకి అనుకోకుండా ప్రవేశించిన దుద్దిల్ల శ్రీధర్ బాబు తండ్రి అడుగుజాడల్లో నిరంతరం పయనిస్తున్నాడు. తండ్రి శ్రీపాదరావును మార్గదర్శకంగా గురువుగా భావిస్తూ అడుగులో అడుగు వేస్తూ ప్రజల కష్టసుఖాల్లో నిరంతరం నిమగ్నమవుతున్నారు. 1999లో రాజకీయాలకు ప్రవేశించిన శ్రీధర్ బాబు మంతెన నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1999, 2004.2008, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి రోశయ్య ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కాలంలో మంత్రిగా వ్యవహరించారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి సర్కారులో కీలకంగా వ్యవహరిస్తున్నారు. శ్రీధర్ బాబు కూడా రాజకీయాల్లోకి వస్తానని ఎప్పుడు అనుకోలేదు. ఈ విషయాన్ని ఎన్నోసార్లు ఆయన స్వయంగా చెప్పుకొచ్చారు. మా నాన్న ఆకస్మిక మృతితో నేను రాజకీయాలకు రావాల్సి వచ్చిందని నిత్యం చెబుతుంటారు. రాజకీయాల్లోకి రాకుంటే అడ్వకేట్ గా ప్రాక్టీస్ చేసుకుంటు ఉండేవాడినని ఎన్నోసార్లు చెప్పారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ఆశయ సాధనకు నిత్యం పాటుపడుతున్నారు. మంథని నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నారు మంత్రి శ్రీధర్ బాబు. రాష్ట్రంలో ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా ప్రభుత్వంలో కీలక మంత్రిగా వ్యవహరిస్తున్న దుద్దిల్ల శ్రీధర్ బాబు ఒకవైపు రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఎత్తున కృషి చేస్తూ మంతిని నియోజకవర్గ అభివృద్ధిని మరింత పరుగులు పెట్టిస్తున్నారు. బుచ్చి పంతులు తనయుడుగా తండ్రికి తగ్గ తనయుడుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. తండ్రి శ్రీపాదరావు ఎమ్మెల్యేగా స్పీకర్గా పనిచేసిన కాలంలో ఆయనను దగ్గర నుంచి చూసిన శ్రీధర్ బాబు ప్రజా సమస్యల పరిష్కారంలోను తండ్రి లాగానే స్పందిస్తున్నారు. ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటూ కష్టసుఖాల్లో ఆత్మీయుడుగా వ్యవహరిస్తున్నారు. శ్రీపాదరావు లాగా శ్రీధర్ బాబు కూడా ప్రజల్లో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. దుదిల్ల కుటుంబానికి ప్రజలతో ఉన్న ఆత్మీయ అనుబంధం అలాంటిది.. ఇప్పటికీ ఎప్పటికీ రాబోయే కాలానికి.. ఇది శాశ్వతంగా వారి పేరు నిలిచిపోతుంది..



- గొట్టిముక్కుల బ్రహ్మాచారి
9441884389



## మంత్రి పొంగిలేటి పర్యటన విజయవంతం చేయండి

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి**

**చర్ల, మహా:** తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చర్ల మండల పర్యటన విజయవంతం చెయ్యాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి శనివారం ఒక ప్రకటన లో కోరారు.మంత్రి పొంగులేటి ఆదివారం చర్ల సి హెచ్ సి లో రూ. 10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న భవనం కు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. అనంతరం వెంకటలక్ష్మి ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికయిన చర్ల, మండల సర్పంచ్ లకు సన్మానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో చర్ల మండలం ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళా నాయకులు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

# ఐకేపీ అక్రమాలపై కొనసాగుతున్న విచారణ

- మొండి బకాయిలెన్ని...? మింగేసినవి ఎన్ని..?
- లెక్కలు తేల్చే పనుల్లో ఐకేపీ యంత్రాంగం
- మొట్లగూడెం అక్రమంపై క్రిమినల్ కేసులు ఎందుకు పెట్టరు..?

**కారేపల్లి, మహా:** సింగరేణి మండలంలో ఐకెపిలో జరుగుతున్న అక్రమాల పై విచారణ తూ తూ మంత్రంగానే కొనసాగుతోంది. మూడు కోట్ల రూపాయల పైబడిన మొండి బకాయిలలో ఉద్దేశ పూర్వకంగా మింగేసినవి అన్ని? మొండి బకాయిలు ఎన్ని? అనే అంశాలను పరిశీలిస్తూ లెక్కలు తేల్చే పనుల్లో ఐకెపి అధికారులు ఉన్నట్లు సమాచారం. గతంలో ఇక్కడ పనిచేసిన కొందరు అధికారులు జిల్లాస్థాయిలో కొందరు అధికారులతో కూడా మంచి సంబంధం ఏర్పాటు చేసుకొని అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు కొందరి రాజకీయ నాయకుల అండదండలు కూడా అక్రమార్కులకు నిండుగా ఉండటంతో ఇష్టా రాజ్యాంగా వ్యవహరించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆర్ ఆర్ యాక్ట్ ప్రయోగించాల్సిన పరిస్థితి కారేపల్లి మండల స్వయం సంఘాలకు ఎవరు తెచ్చారనే దానిపై రకరకాలుగా చర్చించుకుంటున్నారు. కొందరు అక్రమార్కుల వల్ల మండలం మొత్తానికి చెడ్డ పేరు వస్తుందని ఐకెపిలో ని నిజాయితీపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




**మొట్లగూడెం అక్రమంలో బ్యాంకు ఉన్నతాధికారుల మౌనం ఎందుకు?**

మొట్లగూడెం గ్రామంలో లేని వారి పేర్లతో ఫేక్ గ్రూప్ ని సృష్టించి బ్యాంకు సొమ్మును అక్రమంగా కాజేసిన వారికి పూర్తిస్థాయిలో సహకరించిన అప్పటి ఏపీజీవీబీ మేనేజర్ పై చర్యలు తీసుకోవడం లో బ్యాంకు ఉన్నతాధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారనే ప్రశ్న తలెత్తుతుంది. బ్యాంకు లింకేజీ రుణం అనేది పూర్తిస్థాయిలో అది బ్యాంకు సొమ్ము. రూ. 12 లక్షల బ్యాంకు సొమ్మును స్వరాజ్, వినాయక్ అనే గ్రూపుల పేర్లతో అక్రమంగా కాజేశారని బట్టబయలైనప్పటికీ అతనిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పరువురు ప్రశ్నిస్తున్నారు.

**తూతూ మంత్రంగా ఐకేపీ అధికారుల విచారణ**

అడ్డగోలుగా అడ్డు అదుపు లేకుండా చేసిన మొట్లగూడెం అక్రమంపై ఐకెపి అధికారులు తూతూ మంత్రంగా విచారణ జరిపి తప్పు చేసినవారిని కాపాడే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. గ్రామంలో లేని వారితో గ్రూపును తయారుచేసి వారికి లోన్లు మంజూరు చేయించడం లో కీలకపాత్ర పోషించిన సీసీ పై చర్యలు తీసుకోవడంలో ఎందుకు వెనకాడుతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**క్రిమినల్ కేసులు ఎందుకు పెట్టరు?**

అక్రమంగా బ్యాంకు సొమ్మును కాజేసిన దాంట్లో పాత్రధారులైన బ్యాంకు మేనేజర్, ఐకెపి సీసీ, బుక్ కీపర్ పై క్రిమినల్ కేసులు ఎందుకు పెట్టకూడదని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి అడ్డగోలుగా ఫైల్స్ తయారు చేసే బ్యాంకు సొమ్ము 12 లక్షల రూపాయలు కాజేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని ఇప్పటికే ఓ రాజకీయ పార్టీ అనుబంధ మహిళా సంఘం ప్రకటన కూడా చేసింది. ఐకేపీ అక్రమాలపై ఆందోళనలు చేయకముందే అధికారులు స్పందించి నిష్పక్షపాత విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యేపాయం



**పినపాక(కరకగూడెం),మహా:** మండల పరిధిలోని వట్టం వారి గుంపు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న మెనూ, భోజన నాణ్యత, వసతి సౌకర్యాలు మరియు పరిశుభ్రతను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, హాస్టల్ సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమం ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుంటుందని తెలిపారు. హాస్టల్‌కు నూతన భవనం మంజూరు చేయించిన విషయాన్ని విద్యార్థులకు అధికారులకు తెలియజేస్తూ త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం రామచంద్రరావు, వార్డెన్ రవీందర్ ఎంఆర్ఓ వి. కాంతయ్య , ఎంపీడీవో కుమార్, మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అలాగే సర్పంచ్‌లు బట్టుపల్లి తోలెం రమాదేవి, కరకగూడెం పోలేబోయిన సుజాత, చిరుమల్ల కొమరం సుగుణ, వెంకటాపురం చౌలం కేశవరావు, చొప్పాల తోలెం సావిత్రి గొల్లగుడెం ఎల్లబోయిన ముత్తమ్మ, కొత్తగూడెం ఎర్రం పొట్టయ్య పాల్గొన్నారు.రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు, ఉప సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు, పోలేబోయిన శ్రీవాణి, తిరుపతయ్య, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు, అభిమానులు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఘనంగా ఎఫ్ఎల్ఎన్ బాలమేళా 2.0 గ్రంథాలయ అభ్యసన పండుగ

**పినపాక(కరకగూడెం),మహా:** కరకగూడెం మండలం అనంతారం కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని ఎఫ్ ఎల్ ఎన్ బాలమేళా 2.0 గ్రంథాలయ అభ్యసన పండుగ కార్యక్రమాలు శనివారం ఘనంగా ప్రారంభించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని కాంప్లెక్స్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు జి. పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు.విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. బాలమేళా సాధారణ ప్రదర్శన మేళా కాకుండా, ఇది సామర్థ్య ఆధారిత రాత పరీక్ష రూపంలో నిర్వహించబడుతుంది. 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, గణితం విషయాల్లో వారి నేర్పును అంచనా వేయబడుతుంది. ప్రతి పాఠశాల నుంచి ప్రతి తరగతి నుండి ఒక విద్యార్థి కాంప్లెక్స్ స్థాయిలో పరీక్షకు హాజరవుతారు.అదేవిధంగా, గ్రంథాలయ అభ్యసన పండుగలో భాగంగా విద్యార్థుల భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు కథా విన్యాస కార్యక్రమం నిర్వహించబడుతుంది. గ్రంథాలయంలోని ఒక కథను ఎంపిక చేసుకుని, హావభావాలతో స్పష్టంగా కథ చెప్పే విధంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ప్రతి తరగతి నుంచి ఒక విద్యార్థి కథ చెప్పడానికి ఎంపిక చేయబడతారు.మొత్తం ప్రతి తరగతి నుంచి




ఇద్దరు విద్యార్థులు పాల్గొంటారు ఒకరు రాత పరీక్షకు, మరొకరు కథా విన్యాసానికి.ఒకే విద్యార్థి ఉన్న పాఠశాలల్లో ఆ విద్యార్థి రెండు విభాగాల్లోనూ పాల్గొనవచ్చు.ఈ కార్యక్రమాలు కేవలం పోటీలు మాత్రమే కాకుండా, విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందించే వేదికలుగా నిలుస్తాయి. వారి ప్రతిభను వెలికితీసే అవకాశాలను కల్పిస్తాయి. ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు."విద్యార్థుల పునాది బలంగా ఉంటేనే భవిష్యత్తు బలంగా ఉంటుంది" అనే సంకల్పంతో ఎఫ్ ఎల్ ఎన్ లక్ష్యాలను సాధించేందుకు ఈ బాలమేళా గ్రంథాలయ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్స్ జి. వెంకటేశ్వర్లు, బి. బావ్ సింగ్, కె. సూర్యనారాయణ , ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా టైలర్స్ డే వేడుకలు

**నేలకొండపల్లి, మహా:** మండల కేంద్రంలో శనివారం టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. నవభారత్ టైలరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండలాధ్యక్షుడు వెగ్గళం విశ్వానాథం మాట్లాడారు...రెడ్మెడీ రంగం తో గ్రామీణ ప్రాంతాలలో ఉన్న టైలర్స్ వృత్తి పూర్తిగా దెబ్బతిందని పేర్కొన్నారు. టైలర్స్ కు ప్రత్యేక రాయితీలు అందించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మహేశ్వర అప్పారావు. తుమ్మా వెంకట్రావ్, యాకోబ్, వాసు. హరి, విశ్వేషరరావు. సుబ్బారావు, సత్యానారాయణ, ఎల్లేష్, గౌస్, శ్రీను, తేజావత్తు వాసు రమేష్, భాసిం, రఫీ, జనార్ధన్, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం పట్ల అప్రమతంగా ఉండాలి

- మాజీ సర్పంచ్ల పెండింగ్ బిల్లులను ఇవ్వాల్సిందే
- వీధి కుక్కల పట్ల తగిన చర్యలు తీసుకోవాలి.
- జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు

**నేలకొండపల్లి, మహా:** పారిశుద్ధ్యం పట్ల అధికారులు అప్రమతంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయం లో శనివారం పంచాయతీ కార్యదర్శులతో జూమ్ మీటింగ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులలో మాజీ సర్పంచ్లు చేసిన పనులకు సంబంధించిన బిల్లులను నిబంధనల మేరకు ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు! వ్యక్తిగత. ఇతరత్రా 'కారణాలతో బిల్లులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయని అన్నారు. ఇటీవల జరిగిన సర్పంచ్ల




శిక్షణ తరగతులలో వాటికి సంబంధించిన వివరాలను తెలియజేశామని అన్నారు. నిబంధనల మేరకు పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఆయా ఎంపీడీవో లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మార్చి నాటికి నూరు శాతం పన్నులు వసూలు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. వీధి కుక్కల పట్ల కార్యదర్శులు అప్రమతంగా ఉండాలన్నారు. వారంలో జిల్లా వ్యాప్తంగా వీధి కుక్కలను పట్టించి సుదూర ప్రాంతాలలో వదిలేయాలని సూచించారు. తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా యాక్షన్ ప్లాన్ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజనల్ పంచాయతీ అధికారి విజయలక్ష్మి, నేలకొండపల్లి ఎంపీడీఓ. యం.యర్రయ్య లు ఉన్నారు.



## క్రమశిక్షణతోనే గుర్తింపు

**సెక్యూరిటీ అధికారి జాకీర్ హుస్సేన్**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** విధి నిర్వహణలో క్రమశిక్షణతో ముందుకు పోతానే గుర్తింపు లభిస్తుందని ఏరియా సెక్యూరిటీ ట్రైనింగ్ అధికారి జాకీర్ హుస్సేన్ అన్నారు. ట్రైనింగ్ సెంటర్లో సెక్యూరిటీ సిబ్బందికి వారం రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌పై పూర్తి స్థాయి అవగాహన అవసరమని సూచించారు. శిక్షణ కార్యక్రమంతో సెక్యూరిటీ సిబ్బంది పనితీరు గణనీయంగా మెరుగు పడిందని వారం రోజుల శిక్షణా కాలంలో ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌లోని అన్ని అంశాలపై బోధించడం జరిగిందని పేర్కొన్నారు.మెయిన్ హాస్పిటల్, మైన్స్ రెస్క్యూ స్టేషన్, భద్రాద్రి కొత్తగూడెం ఫైర్ స్టేషన్ నుండి ఫ్యాకల్టీని తీసుకోవడం జరిగిందని వివరించారు.మనకు ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన ఉంటే మన తోటి వారు ఆపదలో ఉన్నప్పుడు డాక్టర్ వద్దకు తీసుకు వెళ్ళే లోపు వారి ప్రాణాలను కాపాడవచ్చునని మనం పని చేయు ప్రదేశాలలో అగ్ని ప్రమాదం సంభవించినపుడు వాటిని నివారించి సింగరేణి ఆస్తులను పరిరక్షించగలమని మెరుగైన వృత్తి నైపుణ్యంతో క్రమశిక్షణతో నీతినిజాయితీతో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సమాజాభివృద్ధికై సెక్యూరిటీ సిబ్బంది అందరూ పాటుపడాలని తెలిపారు. అనంతరం శ్రీ జ్యోతి అనాథ వృద్ధుల శరణాలయ నిర్వాహకులకు సెక్యూరిటీ సిబ్బందిచే నిత్యావసర సరుకులను వితరణ గావించారు.

## రోడ్డు పక్కన భారీ గుంతలు..

**ప్రత్యేక చొరవ చూపించిన సర్పంచ్, ఉప సర్పంచ్..**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని అరుంధతి నగర్‌లో రోడ్డు పక్కన ఏర్పడిన భారీ గుంతలను శనివారం గ్రామపంచాయతీ అధికారులు పూడ్చివేశారు. మామిడి చెట్ల గుంపు ప్రాంతంలో పూన రవి ఇంటి నుంచి పార్వతి ఇంటి వరకు గల సీసీ రోడ్డు పక్కన కోడిపుంజుల వాగు వరద ఉధృతి కారణంగా పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. ఈ విషయాన్ని స్థానికులు గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురావడంతో సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ ప్రత్యేక చొరవ తీసుకొని ముందుండి మట్టితో గుంతలను పూడిపించే పనులను చేపట్టించారు. తాత్కాలికంగా ప్రమాదాన్ని నివారించేందుకు మట్టి నింపించి రహదారిని సమతలంగా మార్చారు .ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌తో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. రహదారిపై శాశ్వత నిర్మాణం చేపట్టాలని ఈ సందర్భంగా గ్రామస్తులు కోరారు.





## ప్రజల దాహార్తి తీర్చేందుకు సొంత నిధులతో వాటర్ ప్లాంట్

**నేలకొండపల్లి, మహా:** ప్రజల దాహార్తి ని తీర్చేందుకు సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేస్తున్నట్లు అమ్మగూడెం పంచాయతీ సర్పంచ్ పొట్ట లక్ష్మి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలం లోని అమ్మగూడెం పంచాయతీ లో మాజీ సర్పంచ్ పొట్ట రామారావు జ్ఞాపకార్థం రూ.5 లక్షలతో వెంకటేశ్వర గార్డెన్ ఎండీ పొట్ట చంద్రశేఖర్ తన అన్న పేరుతో సొంతంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను సర్పంచ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడారు... ప్రజల దాహార్తి ని తీర్చేందుకు తమ కుటుంబం సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ద్వారా మంచినీటి ని అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేణు. వార్డు సభ్యులు భవాని, కళ్యాణి, కె.వెంకటేశ్వర్లు. నరసయ్య, చంద్రశేఖర్," అడపాల రవీందర్. రామారావు. నాగేశ్వరరావు. కె. సత్యం. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని యధాతధంగా కొనసాగించాలి

**వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్**

**సత్తుపల్లి, మహా:** మండల పరిధిలోని గంగారం గ్రామీణ ఉపాధి హామీ పనులను శనివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ సందర్శించారు. పనిచేస్తున్న దినసరి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎం.జి.ఎన్.ఆర్ ఈ.జి.ఏ ఉపాధి హామీ కూలీలకు చట్టబద్ధమైన సముచితమైన హక్కును కల్పించిందన్నారు. ప్రజలు పని కావాలని కోరితే ప్రభుత్వం పని కల్పించాలని, లేదంటే పరిహారం చెల్లించాలనే హక్కు పాత చట్టంలో పొందుపరిచారని గుర్తు చేశారు. మోదీ కొత్తగా రూపొందించిన చట్టంలో వీ.బీ.జీ.ఆర్ ఏ.ఎం.జీ లో పని హక్కు లేదని తెలిపారు. దినసరి కూలీలకు ఉపాధి కల్పించడం కేంద్ర ప్రభుత్వం దయాదాక్షిణ్యంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయల సమయంలో 60 రోజులపాటు పనిని నిషేధించారని, ఇది ఉపాధి హామీ భద్రతకు పూర్తి విరుద్ధమని విమర్శించారు. 125 రోజులు పని కల్పిస్తామని చేసిన వాగ్దానం పెద్ద అబద్ధం అన్నారు. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న రాష్ట్రాలలో దినసరి కూలీలకు ఉపాధి హామీ కల్పిస్తూ 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 60 శాతం కేంద్ర ప్రభుత్వం ఆర్థిక భారం భరించాలని, కొత్త పథకాల అమలుతో పేదలకు పని లేకుండా చేస్తున్నారని ఆయన అన్నారు. ఇతర రాష్ట్రాలలో సంక్షేమ పథకాలకు, ఇచ్చిన హామీలకు



బడ్జెట్ లేక ఇబ్బందులు పడుతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై భారం మోపడం అన్యాయం అన్నారు. గత ఐదు వారాలుగా కూలీలకు డబ్బులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో త్రాగునీరు, టెంటు, మెడికల్ కిట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. వికసిత్ భారత్ జి రామ్ జి 2025 /197 బిల్లును రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కువారపు లక్ష్మణరావు, మండల కమిటీ సభ్యులు అయినంపూడి సునందరావు, రామలక్ష్మి, టి దుర్గా, పమ్మి నాగలక్ష్మి, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, తగరం సీతారాములు, నల్లంటి జ్యోతి, జూపూడి మమత, గాదె సత్యనారాయణ, బన్నె సాంబ, చిన్నం రాఘవరావు, బన్నె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహించడానికి సింగరేణి ముందుంటుంది

- సింగరేణి జయం పర్సనల్ వెల్ఫేర్ కిరణ్ కుమార్
- ఘనంగా సింగరేణి కార్పొరేట్ ఏరియా
- 19వ వార్షిక క్రీడా సాంస్కృతిక వార్షికోత్సవం

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** క్రీడాకారులను ప్రోత్సహించడానికి సింగరేణి ఎల్లప్పుడూ ముందుంటుందని సింగరేణి జిఎం పర్సనల్ వెల్ఫేర్ జీవి కిరణ్ కుమార్ అన్నారు. సింగరేణి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 19వ క్రీడా వార్షికోత్సవంను కొత్తగూడెం సిఈఆర్ క్లబ్ నందు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిఎం(పర్సనల్)వెల్ఫేర్ జివి.కిరణ్ కుమార్ ముఖ్యఅతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం క్రీడాకారులను




ప్రోత్సహించడానికి ప్రత్యేక బడ్జెట్ ను కేటాయిస్తుందని పేర్కొన్నారు. క్రీడాకారుల కోసం సుశిక్షితులైన కోచ్‌లతో కోచింగ్ క్యాంప్ లను నిర్వహిస్తూ క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తుందని ఇందులో మంచి క్రీడా ప్రతిభతో స్నేహభావంతో క్రీడలలో రాణించాలని క్రీడలు అనేవి శారీరక దృడత్వానికి, ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఉద్యోగులు తమ తమ పనులను నిర్వహిస్తూనే క్రీడలలో ఆసక్తి చూపడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ క్రీడలలో సీనియర్ క్రీడాకారులతో పాటు యువ ఉద్యోగులు ఎక్కువగా పాల్గొనేలా ప్రోత్సహించి కోల్ ఇండియా స్థాయి పోటీలలో మన సంస్థ మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. తదుపరి వివిధ క్రీడల్లో గెలుపొందిన ఉద్యోగులకు అభినందనలు తెలిపి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ డబల్యూపిఎస్ అండ్ జిఏ కార్పొరేట్ ప్రెసిడెంట్ జి.వి. కిరణ్ కుమార్ తో పాటు డిజిఎం(పర్సనల్) కేసా నారాయణరావు, డిజిఎం (పర్సనల్)బి.శివకేశవ రావు, గుర్తింపు సంఘం(ఏఐటియుసి) బ్రాంచ్ సెక్రటరీ ఏస్.వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్టియుసి) కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పితాంబర రావు, సిఎంఓఏఐ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ కేశవరావు, డివైపిఎం అండ్ కార్పొరేట్ ఏరియా హనరరీ సెక్రటరీ కే.సునీల్ కుమార్, సీనియర్ పిఓ ఏం.శ్రీనివాస్, కమ్యూనికేషన్ ఆఫీసర్ ఎన్.సుజ్ఞాన్, స్పోర్ట్స్ సూపర్వైజర్ ఎంసి. పోస్నెట్, కార్పొరేట్ ఏరియా స్పోర్ట్స్ కొఆర్డినేటర్ పి. నితిన్ కుమార్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# పిచ్చి కుక్క స్వైరవిహారం..!

- 8 మందిపై దాడి చేయటంతో తీవ్ర గాయాలు
- జనంపైకి దూసుకరావటంతో... భయంతో పరుగులు.
- వెంటబడి హతమార్చిన స్థానిక యువత. బాధితులను
- పరామర్శించిన డీపీవో, డీయం అండోచ్వా.

**నేలకొండపల్లి, మహా:** ఓ పిచ్చి కుక్క శనివారం సైర్వ విహారం చేసి...8 మందిని గాయపరిచింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని ముజ్జుగూడెం లో శనివారం పిచ్చి కుక్క సైర్వ విహారం చేయటంతో ప్రజలు పరుగులు తీశారు. గ్రామంలో రహదారి వెంట ఉన్న బీ.వెంకటేశ్వర్లు (65), అక్బర్ (16), బుర్రయ్య (65), ఆక్షయకుమార్ (19), జాహిద్ (9), ఎస్.కె.రెహాన్(12), వీరయ్య (70) లపై దాడి చేసి విచక్షణారహితంగా 'గాయపరిచింది. రోడ్ల వెంట వెళ్లే వారి పై పిచ్చి కుక్క దాడి చేసేందుకు దూసుకొస్తుండటంతో ప్రజలు పరుగులు తీశారు. గ్రామస్తులు వెంటపడటంతో ఆచార్లగూడెం వైపు పరుగులు తీసింది. అదే సమయంలో ఆచార్లగూడెం కు చెందిన యాదయ్య (45) వాకింగ్ కు వస్తుండటంతో వెంటపడి తీవ్రంగా గాయపరిచింది. స్థానిక యువత పిచ్చి కుక్క వెంట పడి హతమార్చటంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. బాధితులను స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. కాగా వీరయ్య అనే వ్యక్తి కి తీవ్ర గాయాలు కావటంతో ప్రధమ చికిత్స చేయించి ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ అనుదీఫ్ దురిశెట్టి జిల్లా అధికారులను అప్రమతం చేశారు. వెంటనే జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.రామారావు, జిల్లా ఆసుపత్రుల సమన్వ అధికారి డాక్టర్.కె.రాజశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, డివిజనల్ పంచాయతీ అధికారి విజయలక్ష్మి లు బాధితులను పరామర్శించారు.వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అవసరమైన ఇంజక్షన్లు, మందులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం ముజ్జుగూడెం గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కుక్కల నివారణ కు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి కుక్కలను పట్టించి సుదూర ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు అప్రమతంగా ఉండాలని ఆదేశించారు. పంచాయతీ సర్పంచ్ కు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, వైద్యాధికారి డాక్టర్.మంగళ, ఆయా పంచాయతీ సర్పంచ్ లు శీలం వెంకటలక్ష్మి, కొలిక పొంగు ఉప్పలమ్మ, బొడ్డు వసంత,సర్పంచ్ కు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, వైద్యాధికారి డాక్టర్.మంగళ, ఆయా పంచాయతీ సర్పంచ్ లు శీలం వెంకటలక్ష్మి, కొలిక పొంగు ఉప్పలమ్మ, బొడ్డు వసంత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## కుక్కలు కోతులను నివారించండి


**కార్పొరేషన్ మేయర్ గణేష్ కు విజ్ఞప్తి**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లో కుక్కలు కోతుల బెడద తీవ్రంగా ఉందని వీటి నివారణకు చర్యలు చేపట్టి ప్రజలు ప్రశాంతంగా ఉండే విధంగా చూడాలని రైల్వే బోర్డు మెంబర్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, 55వ డివిజన్ కార్పొరేటర్ హరిహరన్ లు విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ ను శనివారం సౌత్ సెంట్రల్ రైల్వే డి.ఆర్.యు.సి. సి.మెంబర్, మాజీ కౌన్సిలర్ వై. శ్రీనివాస్ రెడ్డి 55వ, డివిజన్ కార్పొరేటర్ సింగర హరిహరన్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శాలువాతో సత్కరించి అభినందించి శుభాకాంక్షలు చెప్పారు. ముందుగా డివిజన్ లలో కోతులు కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతూ మేయర్ గణేష్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి, హరిహరన్ మాట్లాడుతూ 55వ డివిజన్లో గత రెండు సంవత్సరాల క్రితమే 50 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి టెండర్ పూర్తి చేసి శంకుస్థాపన చేశారని కానీ నేటి వరకు పనులు ప్రారంభించలేదని వారు మేయర్ దృష్టికి తీసుకువెళ్లారు.కొత్తగూడెం కార్పొరేషన్ లో భాగంగా గతంలో ఉన్న వార్డు స్థానంలో డివిజన్ గా ఏర్పడి జనాభా సంఖ్య కూడా పెరిగిందని గతంలో మంజూరైన 50 లక్షలతో పాటు మరో 50 లక్షలు అదనంగా మంజూరు చేసి కోటి రూపాయలతో డివిజన్ ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా మినీ ఫంక్షన్ కమ్యూనిటీ హాల్ నిర్మించి ప్రజలకు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. అదేవిధంగా ప్రజలను వృద్ధులను పిల్లలను గాయపరుస్తూ దాడులు చేస్తూ ఇబ్బంది పెడుతున్న కోతులను కుక్కలను ప్రత్యేక డ్రైవ్, నిధి ఏర్పాటు చేసి పూర్తిగా పట్టించి దూరంగా చింతూరు అడవుల్లో విడిచి పెట్టే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని మేయర్ కి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మేయర్ గణేష్ మాట్లాడుతూ తప్పనిసరిగా 55వ డివిజన్లో మినీ ఫంక్షన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని కోతులు కుక్కల పట్టివేతకు అధికారులతో చర్చించి కఠినమైన ఆదేశాలు ఇచ్చి పూర్తిగా స్పెషల్ డ్రైవ్ నిధి ఏర్పాటు చేసి పూర్తిగా పట్టించి దూరంగా దట్టమైన అడవుల్లో విడిచిపెడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



## విజయ్, రష్మికలకు సర్‌ప్రైజ్ గిఫ్ట్

విజయ్ దేవరకొండ రష్మిక మందన్న నూతనంగా పెళ్లి చేసుకున్నారు. వారిద్దరి సంతోషాన్ని రెట్టింపు చేసేందుకు రణబాలి మూవీ నుంచి స్పెషల్ వీడియోను విడుదల చేసి మేకర్స్ సర్‌ప్రైజ్ చేశారు. ఏందయ్యా సామీ అంటూ సాగే ఒక గీతాన్ని ప్రోమోగా వదిలారు. సింగర్స్ శ్వేతా మోహన్, అజయ్ గోగవాలే ఆలపించిన ఈ పాటను రామజోగయ్య శాస్త్రి రచించారు. ఈ పాటలో కొత్తగా పెళ్లైన దంపతులుగా విజయ్, రష్మికలు కనిపిస్తున్నారు. 1854 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ చారిత్రక సంఘటనల ఆధారంగా రణబాలి చిత్రాన్ని డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబరు 11న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



### వెంకటప్పయ్య నాయుడుగా కలెక్షన్ కింగ్..

## మోహన్ బాబు లుక్ అదిరింది!



'ఆర్ఎక్స్ 100, మంగళవారం' చిత్రాల ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ మూవీతో సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, దివంగత నటుడు రమేష్ బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ హీరోగా పరిచయం అవుతున్నాడు. అలాగే బాలీవుడ్ నటి రాషా తడాని తెలుగులో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. అశ్వినీదత్ సమర్పణలో చందమామ కథలు బ్యానర్‌పై పి.కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు కూడా ఓ కీలక పాత్ర పోషిస్తున్నాడు. తాజాగా ఆయన లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ఇందులో ఆయన 'వెంకటప్పయ్య నాయుడు' అనే పాత్రలో నటిస్తున్నాడు. ఈ పోస్టర్‌లో మోహన్ బాబు సాధారణ తెల్లటి కుర్తాధోతీ ధరించి పవర్ ఫుల్‌గా, గంభీరంగా కనిపిస్తున్నాడు. పోస్టర్‌ని బట్టి చూస్తే.. ఈ సినిమాలో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో మోహన్ బాబు నటించినట్లు తెలుస్తుంది. చాలాకాలం తర్వాత మోహన్ బాబు మళ్లీ ఇలాంటి పాత్రలు చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న 'ది ప్యారడైజ్'లోనూ మోహన్ బాబు విలన్‌గా నటిస్తున్నాడు.

## నాతో నటించేందుకు హీరోలు ఇష్టపడరు

'ఝుమ్మంది నాదం' సినిమాతో వెండితెరపై కథానాయికగా పరిచయమైంది తాప్సీ పన్ను. మిస్టర్ పర్ఫెక్ట్, వీర, మొగుడు, దరువు, సాహసం, గేమ్ ఓవర్, మిషన్ ఇంపాజిబుల్ ఇలా తెలుగులో అనేక సినిమాలు చేసింది. తమిళ చిత్రాల్లోనూ తళుక్కుమని మెరిసింది. సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా రాణిస్తున్న సమయంలోనే బాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటూ అక్కడే పాగా వేసింది.



### హీరోల వెనకడుగు

తాజాగా ఈ బ్యూటీ అస్సి అనే హిందీ సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించింది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్న తాప్సీ తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. నాతో సినిమాలు చేసేందుకు చాలామంది హీరోలు వెనకడుగు వేశారు. కారణాలు తెలీదు కానీ నాతో చేయననేవారు. అలా కొన్ని అవకాశాలు చేజారిపోయాయి.

### చాలామందికి పెద్ద షాక్

చాలామటుకు సినిమాల్లో హీరోయిన్ ఎవరనేది ఫైనల్‌గా హీరోనే నిర్ణయిస్తాడు. అయితే కొందరు దర్శకులు మాత్రం ఫలానా హీరోయినే కావాలని పట్టుబడతారు. వారు కోరుకున్న హీరోయిన్‌తోనే సినిమా మొదలుపెడతారు. ఉదాహరణకు డంకీ సినిమానే తీసుకుందాం. డైరెక్టర్ రాజ్ కుమార్ హిరానీ సర్ నన్నే తీసుకోవాలని డిసైడయ్యారు. నిజానికి షారూఖ్‌తో తరచూ జత కట్టే హీరోయిన్స్ వేరు. కానీ, అది బ్రేక్ చేస్తూ నన్ను ఎంపిక చేయడంతో చాలామంది షాకయ్యారు. ఇకపోతే నాతో పనిచేయడం కష్టమని ఓ రూమర్ ఉంది. అదెలా వచ్చిందో నాకర్థం కాదు.

### అదే నిజమైతే..

ఎందుకంటే నా కెరీర్‌లో చాలామంది దర్శకుడు నాతో మళ్లీ మళ్లీ పని చేశారు. నాతో పని చేయడం కష్టమైతే సెకండ్ టైమ్ నన్నెందుకు తీసుకుంటారు? నాతో పని చేయనివారు, నా గురించి తెలియనివారే నాపై అనవసరమైన రూమర్ పుట్టించారు. దానికోసం ఆలోచించి నేనేంటో బయటకు వచ్చి చెప్పాల్సిన పనిలేదు. నేను పనితోనే సమాధానం చెప్తాను అంది తాప్సీ.

## 'స్పిరిట్' పోస్టర్‌తో వైరల్ అవుతున్న బ్యూటీ.. ఎవరో తెలుసా?

ప్రభాస్ సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'స్పిరిట్'. తాజాగా ఈ మూవీ నుంచి అదిరిపోయే అప్‌డేట్‌ను సందీప్ పంచుకున్నారు. ఈ మూవీలో కనిపించనున్న విలన్ పాత్రను ఆయన పరిచయం చేశారు. బాలీవుడ్ ప్రముఖ నటుడు వివేక్ ఒబెరాయ్ లుక్‌ను విడుదల చేశారు. అయితే, పోస్టర్‌లో ఆయనతో పాటుగా మరో అమ్మాయి కనిపిస్తుంది. దీంతో ఆమె గురించి తెలుసుకునేందుకు నెటిజన్లు ఆసక్తి చూపుతున్నారు. స్పిరిట్ పోస్టర్లో వివేక్ ఒబెరాయ్‌తో పాటుగా కనిపిస్తున్న ఆ బ్యూటీ పేరు ఐశ్వర్య దేశాయ్. ఆమె ఇండియన్ అమెరికన్ నటి. ఆమె ఇప్పటికే బాలీవుడ్ గల్లీ బాయ్ సినిమాలో నటించింది. ఆపై ర్యాట్ ఇన్ ద కిచెన్ అనే షార్ట్ ఫిల్మ్‌లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. ఈ చిత్రానికి ఆమె ఉత్తమ సహాయ నటిగా అవార్డ్ కూడా అందుకుంది. యూనివర్శిటీ ఆఫ్ మేరీల్యాండ్ నుంచి మార్కెటింగ్‌లో డిగ్రీ పూర్తి చేసింది. వివేక్ ఒబెరాయ్‌తో పోస్టర్‌లో ఐశ్వర్య దేశాయ్‌ని కలిపి విడుదల చేయడంతో స్పిరిట్‌లో ఆమె పాత్ర బలంగా ఉండబోతుందని అర్థం అవుతుంది. ఒక్క పోస్టర్‌తో ఆమె ఓవర్‌నైట్ స్టార్ అయిపోయింది. స్పిరిట్‌లో సరికొత్త అవతారంలో ప్రభాస్ కనిపించనున్నారు. ఇందులో త్రిప్తి డిమ్రి, వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని 2027 మార్చి 5న విడుదల చేయనున్నారు. భారీ బడ్జెట్‌తో టి సిరీస్, భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్ సంస్థలపై ప్రణయ్‌రెడ్డి వంగా, భూషణ్‌కుమార్, క్రిషన్‌కుమార్ నిర్మిస్తున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com